


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక





సంపుటి: 4 సంచిక: 279, పేజీలు - 08

సోమవారం, ఫిబ్రవరి 24, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati





# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

### - సొరంగంలో సహాయక చర్యలు చేపట్టిన సిబ్బంది

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగుతు న్నాయి. ప్రమాదస్థలానికి ఆర్మీ నిపుణుల బృందం చేరుకుంది. టన్నెల్ బోరింగ్ మెషీన్ ధ్వంస మైనట్టు గుర్తించింది. ఎయిర్ ట్యూబ్స్ ద్వారా టన్నెల్‌లోకి ఈ బృందం చేరుకుంది. వాటర్ స్కానర్ పరికరంతో బురదను గుర్తించే ప్రయత్నం జరుగుతోంది. చిక్కుకున్న 8 మంది ఆచూకీ కోసం రెస్క్యూ టీమ్ ప్రయత్నాలు చేస్తోంది.

#### సొరంగంలోకి జూపల్లి..

ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు టన్నెల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్, సైనిక బృందాలు లోపలికి వెళ్లాయి. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, సైనిక బృందాలతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్లారు.

#### అందరినీ రక్షిస్తాం..


సొరంగం లోపలికి ఆక్సిజన్ పంపుతున్నామని, వాటర్ తోడేసే పనులు నిరంతరం సాగుతున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రెస్క్యూ టీమ్‌లు రాత్రి నుంచి అక్కడే పని చేస్తున్నాయని చెప్పారు. కూలిన మట్టి, నీరు చేరడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందని, వాటిని తొలగించే పనిలో సహాయక బృందాలు శ్రమిస్తున్నాయని మంత్రి జూపల్లి. ఇప్పటికే టన్నెల్ బోర్ మిషన్ వరకూ సహాయక బృందాలు చేరుకున్నాయని లోపల ఉన్నవారిని రక్షిస్తామని మంత్రి జూపల్లి ధీమా వ్యక్తం చేశారు. అయితే, టన్నెల్ లోపల పరిస్థితి భయంకరంగా ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. నీటి ఉధృతికి బోరింగ్ మిషన్ కొట్టుకొచ్చిందన్నారు. అవసరమైన యంత్రాలు లోపలికి తీసుకెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న 8 మందిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.లోపల చిక్కుకున్న వారి నుంచి ఎలాంటి శబ్దాలు రావడం లేదని మంత్రి జూపల్లి తెలిపారు. కార్మికుల విషయంలో పరిస్థితి ఆశాజనకంగా లేదన్నారు. అయినా, వారిని కాపాడేందుకు చివరి వరకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

#### టన్నెల్‌లో నిపుణుల బృందం..

'టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇండియన్ ఆర్మీ నిపుణుల బృందం టన్నెల్‌లో ఉంది. కుదరకపోతే విశాఖ నుంచి నేవీ బృందం వస్తుంది. టన్నెల్ పక్కన గుంత తవ్వితే నీళ్లు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెప్పారు' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. రెస్క్యూ ఆపరేషన్ గురించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రికి తెలియజేస్తున్నామని చెప్పారు.

#### గవర్నర్ ఆరా..

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. జరుగుతున్న సహాయ చర్యల గురించి ఆరా తీశారు. సొరంగంలో చిక్కుకున్న వ్యక్తులను సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాల గురించి కలెక్టర్ గవర్నర్‌కు వివరించారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం,



సైన్యం, నిపుణులు సంఘటన స్థలంలో చురుగ్గా పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ వివరించారు.

#### వేగవంతం చేయాలనీ సూచన

సొరంగంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు చేయాలని జిష్ణు దేవ్ వర్మ అధికారులను ఆదేశించారు. సహాయ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. జరుగుతున్న పరిణామాల గురించి తనకు క్రమం తప్పకుండా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

---

## ఇస్రోపై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం

### - మన్‌కి బాత్‌లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ తన 100వ రాకెట్ ప్రయోగం పూర్తి చేయడం గర్వకారణంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. అంతరిక్ష రంగం లో దేశం ఏటా పురోగతి సాధిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని ఇస్రోకు అభినందనలు తెలియజేశారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడిన ప్రధాని ఇస్రో, ఏఐ రంగాలపై ప్రధానంగా చర్చించారు.

2లో..

---

## పాక్ పై భారత్ చిరస్మరణీయ విజయం

- ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ లో ఘనవిజయం
- 6 వికెట్ల తేడాతో పాక్ ను ఓడించిన టీమిండియా
- 111 బంతుల్లో 100 పరుగులు చేసిన కోహ్లీ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఐసీసీ మేజర్ ఈవెంట్లలో పాకిస్థాన్ పై తన ఆధిపత్యాన్ని భారత్ మరోసారి ఘనంగా చాటుకుంది. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఏలో నేడు జరిగిన లీగ్ మ్యాచ్ లో భారత్ చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. బ్యాటింగ్ కింగ్ విరాట్ కోహ్లీ (100 నాటౌట్) అద్భుత సెంచరీ సాధించిన వేళ టీమిండియా 6 వికెట్ల తేడాతో పాక్ ను చిత్తు చేసింది. ఈ విజయంతో భారత్ సెమీస్ బెర్తును దాదాపు ఖాయం చేసుకుంది. దుబాయ్ లో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన పాక్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. టీమిండియా బౌలర్లు విజృంభించడంతో పాక్

2లో..

---

## ఓఆర్ఆర్ నిర్మాణంలో కీలక పరిణామం

### - 5 జిల్లాల్లో భూసేకరణకు అధికారుల నియామకం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం దిశగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమరావతి ఓఆర్ఆర్ భూసేకరణకు సంబంధించి 5 జిల్లాలకు ఐదుగురు జాయింట్ కలెక్టర్లను అధికారులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పల్నాడు, గుంటూరు, ఏలూరు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 23 మండలాల్లో, 121 గ్రామాల మీదుగా అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణం జరగనుంది. ఏపీ ప్రభుత్వం 189.9 కిలోమీటర్ల పొడవున ఈ ఓఆర్ఆర్ కు శ్రీకారం చుట్టింది. కాగా, హైదరాబాద్ ఓఆర్ఆర్ పొడవు 158 కిలోమీటర్లు అని తెలిసిందే.

#### - 3 ఎలైన్‌మెంట్లను తయారు చేసిన ఎన్‌హెచ్ఏఐ

ప్రస్తుతం ఉన్న కోల్‌కతా– చెన్నై నేషనల్ హైవే నుంచి అమరావతి ఓఆర్ఆర్‌కి దక్షిణం, తూర్పు దిశల మధ్యలో



రెండు లింక్ రోడ్లు నిర్మించనున్నారు. ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ 189.9 కి.మీ. ఓఆర్ఆర్‌కు ఇటీవల ఆమోదం తెలపగా విజయవాడ తూర్పు బైపాస్ నిర్మాణం అక్కర్లేదని స్పష్టం చేసింది. అందుకు ప్రత్యామ్నాయంగా 2 లింక్ రోడ్ల నిర్మాణం చేసుకోవాలని సూచించింది.

2లో..

---

## మందుబాబులకు కిక్కెక్కించే వార్త

### - తెలంగాణలో కొత్త లిక్కర్ బ్రాండ్ల



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని మందుబాబులకు రేవంత్ రెడ్డి సర్కార్ కిక్కెక్కించే వార్త వినిపించింది. ఇప్పుడున్న బ్రాండ్లతో పాటు కొత్త బ్రాండ్లు కూడా రాబోతున్నాయన్న శుభవార్త తీసుకొచ్చింది. ఈ మేరకు కొత్త లిక్కర్ బ్రాండ్స్‌ను

2లో..

---

## యాదగిరిగుట్టలో బంగారు విమాన గోపురం

### - ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి





**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో బంగారు గోపురాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. యాదగిరిగుట్ట నరసింహస్వామి ఆలయంలో దివ్య విమాన స్వర్ణ గోపురానికి మహా కుంభాభిషేక మహా సంప్రోక్షణం నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆలయ విమానం గోపురం స్వర్ణతాపడం చేశారు. దేశంలోనే ఎత్తయిన స్వర్ణగోపురంగా యాదాద్రి ఆలయ గోపురం రికార్డు సృష్టించింది బంగారు తొడుగులతో స్వామివారి ప్రతిమ దేదీప్యమానంగా వెలుగుతూ ఆలయానికి వచ్చే భక్తులకు కనువిందు చేస్తోంది. యాదగిరిగుట్ట

2లో..

---

## రేవంత్ రెడ్డికి బీజేపీ రక్షణ కవచం

### - కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్, బీజేపీ ఒకటేనని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ రక్షణ కవచంలా నిలుస్తోందని అన్నారు. అమృత్ టెండర్లు మొదలు సివిల్ సప్లయిస్ స్కాం వరకు కేంద్రం నిధులు

2లో..

---

## రాష్ట్ర రైతాంగాన్ని ఎర్రబంగారం ఏడిపిస్తోంది

- మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్న షర్మిల
- నష్టాల ఘాటుకు మిర్చి రైతు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడని ఆవేదన
- కూటమి ప్రభుత్వం మిర్చి రైతుల కళ్లతో కారం కొడుతోందని ఆగ్రహం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని ఎర్రబంగారం (మిర్చి)

2లో..



---

## కాంగ్రెస్ అభయ హస్తం.. మొండి హస్తంలా మారింది

- డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి
- 14 నెలలకే ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్నారని వెల్లడి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి ఫైర్

**ఆదిలాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డితో

2లో..



## ఓఆర్ఆర్ నిర్మాణంలో కీలక పరిణామం

హైదరాబాద్‌లో గచ్చిబౌలి వైపు నుంచి ఓఆర్ఆర్‌కి లింకు చేసినట్లుగా చెన్నై- కోల్‌కతా నేషనల్ హైవేలో విజయవాడ బైపాస్ కోసం కాజ నుంచి తెనాలి సమీపంలోని నందివెలుగు వరకు 17 కిలోమీటర్ల మేర 6 లేన్ల లింక్ రోడ్డు నిర్మించనున్నారు. ఇందుకోసం ఎన్‌హెచ్ఏఐ 3 ఎలైన్‌మెంట్లను తయారు చేసి ఏపీ ప్రభుత్వానికి పంపింది. గుంటూరు బైపాస్ మార్గంలో బుడంపాడు నుంచి నారాకోడూరు వద్ద ఓఆర్ఆర్ వరకు 4 లేన్ల రహదారిని అభివృద్ధి చేయడానికిగానూ 3 ఎలైన్‌మెంట్లు సైతం సిద్ధం చేశారు.

### ఓఆర్ఆర్ భూసేకరణకు త్వరలో నోటిఫికేషన్లు

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) నుంచి వెళ్లిన అమరావతి ఓఆర్ఆర్ ఎలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులుచేర్పులు, లింక్‌రోడ్ల ఎలైన్‌మెంట్‌ల ప్రపోజల్ కు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలపనుంది. అనంతరం ప్రతిపాదిత అలైన్‌మైంట్ వివరాలను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు పంపి తుది ఆమోదం పొందాల్సి ఉంటుంది. అమరావతి ఓఆర్ఆర్ భూసేకరణకు సర్వే నంబర్ల వారీగా నోటిఫికేషన్ జారీ కానున్నాయి. మూడు వారాల గడువుతో అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారితో సమావేశమై వారి సమస్య విని.. వాటిని జేసీ, ఎన్‌హెచ్ఏఐ స్థాయిలో చర్చించి పరిష్కారం చూపుతారు.మరోవైపు జాయింట్ మెజర్‌మెంట్ సర్వే చేసి, పెగ్ మార్కింగ్ వేయాలి. అభ్యంతరాలు పరిష్కారమైతే త్రీడీ నోటిఫికేషన్ జారీ చేస్తారు. దాంతో అందులో పేర్కొన్న సర్వే నంబర్లలో ఉన్న భూములు కేంద్రం అధీనంలోకి వెళ్తుంది. తర్వాత 3జి3 నోటిఫికేషన్ జారీతో పరిహారం ఇచ్చేందుకు అవార్డు జారీ చేయనున్నారు. ఎవరి పేరిట ఎంత భూమి ఉంది, ఏ నిర్మాణాలున్నాయి అనేది అందులో పేర్కొంటారు. చివరగా భూసేకరణ నిధుల కోసం పూర్తి వివరాలు ఎన్‌హెచ్ఏఐకి పంపి నగదు రాగానే భూ యజమానులకు చెల్లిస్తారు. దాంతో భూములను ఆధీనంలోకి తీసుకొని, ఎన్‌హెచ్ఏఐ పేరిట మ్యుటేషన్ చేయనున్నారు. మరోవైపు డీపీఆర్ సిద్ధం చేస్తూ, ఇతరత్రా పనులకు అనుమతులను సంబంధిత ఇంజినీర్లు తీసుకుంటారు.

## మందుబాబులకు కిక్కెక్కించే వార్త

ఆహ్వానించేందుకు అవసరమైన చర్యలను తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ చేపట్టింది కూడా. ప్రభుత్వం ఆదేశాల మేరకు కొత్త కంపెనీల మద్యం బ్రాండ్లకు అనుమతులు ఇవ్వనున్నారు. తెలంగాణలో లేని విదేశీ బ్రాండ్లతో పాటు దేశీయ లిక్కర్ బీర్ కంపెనీలు కూడా తమ మద్యం ఉత్పత్తి బ్రాండ్లను అమ్మకాలు జరుపుకునేందుకు కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. కొత్త కంపెనీలు ఇతర రాష్ట్రాల్లో జరుపుతున్న తమ మద్యం అమ్మకాలపై నాణ్యత ప్రమాణాలతో అమ్మకాలు జరుపుతున్నట్లుగా, మద్యం అమ్మకాలపై ఎలాంటి ఆరోపణలు లేవన్న నిర్ధారణ పత్రాలను దరఖాస్తులో జతపరచాలని టీజీబీసీఎల్ కోరింది. అయితే తెలంగాణలో పలు కొత్త కంపెనీలు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఇటీవల టీజీబీసీఎల్ కొందరికి అనుమతులు ఇచ్చింది. పర్మిషన్ ఇచ్చిన కొత్త కంపెనీలపై పలు ఆరోపణలు రావడంతో వాటిని మళ్లీ నిలిపేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్ల ఆహ్వానానికి కొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది. కొత్త దరఖాస్తులను ఆహ్వానించే ముందు బహిరంగ ప్రకటన ఇవ్వాలని టీజీబీసీలకు సర్కార్ ఆదేశించింది. టీజీబీసీఎల్ తెలంగాణలో రిజిస్టర్ కానీ కొత్త సప్లయర్స్ నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి ప్రకటన జారీ చేసింది. కొత్త కంపెనీల నుంచి వచ్చిన దరఖాస్తులను 10 రోజుల పాటు ఆన్‌లైన్‌లో పెట్టాలని నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులపై వచ్చిన అభ్యంతరాలపై విచారణ జరిపి అనుమతులపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. టీజీబీసీఎల్‌లో ఇప్పటికే రిజిస్టరై సరఫరా చేస్తున్న సప్లయర్స్ మాత్రం ప్రస్తుతం ఉన్న పద్ధతిలోనే కొత్త బ్రాండ్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. వీటన్నిటిని తరువాత ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ కొత్త మద్యం బ్రాండ్లపై తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకోనుంది. గతంలో ఏపీలో వచ్చిన లోకల్ బ్రాండ్లు తెలంగాణకు కూడా వస్తాయని ప్రచారం జరగటమే కాకుండా కొన్ని చోట్ల అమ్మకాలు కూడా జరిపాయి. అయితే వాటిపై పెద్ద ఎత్తున విమర్శలు రావటంతో మళ్లీ వాటి అమ్మకాలు నిలిపేశారు. అయితే వచ్చే కొత్త బ్రాండ్లు ఎలాంటివన్నది సర్వత్రా చర్చ నడుస్తోంది.

## యాదగిరిగుట్టలో బంగారు విమాన గోపురం

శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని మాజీ సీఎం కేసీఆర్ పునర్ నిర్మించారు. ఆలయాన్ని రీడిజైన్ చేయించి డెవలప్ చేశారు. తాజాగా హుండీ కానుకలు, దాతలు ఇచ్చి కానుకలతో 68.84 కిలోల బంగారంతో ఆలయ విమాన గోపురానికి స్వర్ణ తాపడం చేయించారు. 125 కిలోల స్వచ్ఛమైన బంగారంతో తాపడం చేశారు. ఇందుకోసం దాదాపు రూ.80 కోట్ల మేర ఖర్చు అయినట్లు యాదాద్రి ఆలయ అధికారులు తెలిపారు. నరసింహావతారాలతో పాటు లక్ష్మీ, కేశవ నారాయణ, గరుడమూర్తుల ఆకారాలు ఆధ్యాత్మిక శోభతో భక్తులకు కనువిందు చేస్తున్నాయి. యాదగిరిగుట్ట ఆలయంలో జరిగిన దివ్య విమాన స్వర్ణ గోపుర మహా కుంభాభిషేక వేడుకలో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. మహా పూర్ణాహుతిలో సీఎం దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అధికారులు రేవంత్ రెడ్డి దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు ఇచ్చారు. ఐదు రోజులుగా మహా సంప్రోక్షణ, స్వర్ణ విమానావిష్కరణ, మహా కుంభాభిషేకాలను వేద పండితులు, ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు.

## కాంగ్రెస్ అభయ హస్తం..మొండి హస్తంలా మారింది

కలిసి ప్రచారం నిర్వహించి, పలు సమావేశాల్లో పట్టభద్రులతో సమావేశమయ్యారు. వరంగల్-ఖమ్మం- నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ, ఆదిలాబాద్- కరీంనగర్- నిజామాబాద్, మెదక్ టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేస్తున్నాం. బీజేపీ మాత్రమే మూడు స్థానాల నుంచి పోటీ చేస్తోందన్నారు. విద్యావంతులు, ఉద్యోగులతో మాట్లాడే పరిస్థితి లేకపోవడంతో వేరే పార్టీలు పోటీ చేసే ధైర్యం చేయట్లేదు. మూడు సీట్లను బీజేపీ దక్కించుకుంటుందన్న నమ్మకం నాకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం నిరుద్యోగ సమస్య ఉంది. ఉపాధ్యాయులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.ఇక కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 సబ్ గ్యారంటీలు అమలు చేయట్లేదు. వీటిపై ఆయా వర్గాల వారు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై 14 నెలల్లోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఈ ప్రభుత్వం ఎప్పుడు ఉండిపోతుందా అన్న పరిస్థితి ఉంది. మహిళలు, నిరుద్యోగులు, రైతులు, రైతు కూలీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఎన్నికల ముందు అన్ని వర్గాల వారికి ఏదో ఒక హామీ ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా మోసం చేస్తోందని వారికి అర్థం అయింది. 100 రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలు 400 రోజులు అవుతున్న అతీగతీ లేదు. గ్యారంటీల అమలులో ప్రభుత్వం దగ్గర కనీసం ఎలాంటి కార్యాచరణ లేదు. హామీలతో అర చేతిలో వైకుంఠం చూపిస్తుంది తప్ప అమలు విషయంలో ఎలాంటి చిత్తశుద్ధి లేదు. మహిళలకు నెలకు ఇస్తానన్న రూ.2 వేలు ఎప్పుడిస్తారో తెలియదు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.35 వేలు బాకీ పడింది. కల్యాణ లక్ష్మీ పథకంలో భాగంగా ఇప్పటి వరకు ఒక్క జంట కు కూడా తులం బంగారం ఇవ్వలేదు. రైతు భరోసా కింద రైతుకు, రైతు కూలీకి ఏటా రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. 50 లక్షల మంది రైతులు, 20 లక్షల మంది కౌలు రైతులకు ఇచ్చిన దాఖలాలు లేవు. వారి పంటపై ఇస్తామన్న బోనస్ ఏది.? ఏ గ్రామంలో ఇల్లు కట్టించలేదో ఆ గ్రామంలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆయన మాటపై నిలబడాలని నేను డిమాండ్ చేస్తున్నా. పక్కా ఇళ్ల నిర్మాణానికి ఇస్తామన్న రూ.5 లక్షలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలి. తెలంగాణ ఉద్యమం కారులకు 250 గజాల భూమి, అమరవీరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేలు ఇస్తానని ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారు. యువ వికాసం పేరుతో విద్యా భరోసా కార్డులు ఒక్క విద్యార్థికి కూడా ఇవ్వలేదు. పింఛన్ 2 వేల నుంచి 4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైందో తెలియదు. దివ్యంగులు, పెన్షన్ దారులను కాంగ్రెస్ ప్రభుతం మోసం చేస్తూ కాలం వెళ్లబుచుతోంది.ఆయుష్మాన్ భారత్ దేశం మొత్తం విజయవంతంగా అమలు అవుతుంటే తెలంగాణలో మాత్రం కేసీఆర్ పుణ్యమా అని తెలంగాణలో అమలు కాలేదు. కాంగ్రెస్ వచ్చాక కూడా పూర్తిగా అమలు చేయకుండా రోగులను ఇబ్బంది పెడుతోంది. గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లకు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు వాటి ఊసే ఎత్తట్లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్ అయిన వారికి 5 డీఏలు పెండింగ్ లో ఉన్నాయి. వాటి గురించి రాష్ట్ర ప్రభుత్వం గాల్లో దీపంలా ఉంచింది. రిటైర్ అయిన వారికి అందాల్సిన బెనెఫిట్స్ ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితి రాష్ట్రంలో ఉంది. పీఆర్సీ అమలు విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వంనిమ్మకు నీరెత్తినట్లువ్యవహరిస్తోంది. 4 వేల నిరుద్యోగ భృతి ఊసు లేదు. బెల్ట్ షాపుల నిర్మూలనపై ఎలాంటి చర్యలు లేవు. బీసీ సబ్ ప్లాన్, మైనారిటీ షబ్ ప్లాన్ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంది. బీడీ కార్మికులకు ఈఎస్ఐ పరిధిలోకి తెస్తామన్న హామీ ఏమైంది. జర్నలిస్టులకు ఇల్లు, ఎవరైనా చనిపోతే రూ.5 లక్షలు ఇస్తామన్న హామీలు గాలికొదిలేశారు. పేదలకు సన్న బియ్యం.ఇస్తామని హామీ ఇచ్చారు కానీ ప్రధాని మోదీ గారు ప్రతి నెలా ఇస్తున్న 5 కేజీల ఉచిత బియ్యం కూడా సరిగ్గా సరఫరా చేయట్లేదు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ ఇచ్చి చేతులెత్తేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్యూర్ కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. కేసీఆర్ అనాలోచిత నిర్ణయాలతో రూ.8 లక్షల కోట్ల కోట్ల అప్పులు తెచ్చింది. ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తోంది. మా పార్టీ అధికారంలోకివస్తే చాలు రాష్ట్రం ఏం అయిపోయినా పర్లేదు అన్న ధోరణిలో హామీలు ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన పార్టీ అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది. డీఎస్సీ కోసం నిరుద్యోగులు కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలు రూ.80 వేళా కోట్ల అప్పుల్లో ఉన్నాయి. డిస్కంలకు ప్రభుత్వ సంస్థలు రూ.28,840 కోట్లు బకాయిలు ఉన్నాయి. వాటి బకాయిలు చెల్లించి నష్టాల నుంచి కాపాడాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు చూస్తోంది. నిజమైన తెలంగాణ ఆకాంక్షలు ఇంకా నెరవేరలేదు. నిజమైన మార్పు తెలంగాణలో అవసరం ఉంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ని తెలంగాణ ప్రజలు ఆదరించారు. రానున్న రోజుల్లో కూడా మరింతగా ఆదరిస్తారని ఆశిస్తున్నాము. ఇప్పటికిప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినా ఆ పార్టీకి గాడిద గుడ్డు సున్నా సీట్లు వస్తాయి. దేశవ్యాప్తంగా కాంగ్రెస వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు గ్రాడ్యుయేట్, టీచర్ ఎన్నికలు మార్పుగా విద్యావంతులు, టీచర్లు బీజేపీకి ఓటేసి గెలిపించాలని కోరుతున్నానన్నారు.

## రాష్ట్ర రైతాంగాన్ని ఎర్రబంగారం ఏడిపిస్తోంది

ఏడిపిస్తోందని, మిర్చి పంట నష్టాల ఘాటుకు రైతన్న ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి కూడా రాక క్వింటాకు రూ.15 వేల నష్టంతో అమ్ముకుంటుంటే అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం మిర్చి రైతుల కళ్లలో కారం కొడుతోందని మండిపడ్డారు. "మిర్చి రైతులకు రూ.11 వేల మద్దతు ధర ఇచ్చి ఉద్ధరించినట్టు కూటమి ప్రభుత్వం గప్పాలు కొడుతోంది. ఎకరాకు లక్షన్నర పెట్టుబడి పెడితే, ఆ లక్షన్నర కూడా రావడంలేదని రైతులు కంటతడి పెడుతున్నారు. కౌలు రైతుకు మరో రూ.50 వేలు అదనంగా నష్టం అంటూ అల్లాడుతున్నారు.రాష్ట్ర రైతులపై కేంద్రానికి నిజంగా ప్రేమే ఉంటే మిర్చి కనీస ధరను రూ.26 వేలుగా ప్రకటించాలి. లేకపోతే, మిర్చి రైతును ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి వెంటనే అమలు చేయాలి. కేంద్రం ఇచ్చే ధరకు తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా మిర్చి రైతుకు బోనస్ ప్రకటించాలి. ఓవైపు మిర్చి రైతు విలవిల్లాడుతుంటే, మరోవైపు టమాటా రైతులకు తీరని కష్టాలు వచ్చిపడ్డాయి. గిట్టుబాటు ధర లేక, కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాక రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో టమాటా కిలో రూ.15 పలుకుతుంటే రైతుకు కిలో మీద మూడ్నాలుగు రూపాయలు కూడా రావడంలేదు. వెంటనే టమాటా రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలి. టమాటా ధరలు పడిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలి" అంటూ షర్మిల డిమాండ్ చేశారు.

## రేవంత్ రెడ్డికి బీజేపీ రక్షణ కవచం

పక్కదారి పట్టించినా కానీ బీజేపీ అతడ్ని కాపాడుతోందని ఆరోపించారు. సాక్ష్యాధారాలతో అనేక సార్లు కేంద్రానికి ఫిర్యాదు చేశామని, కేంద్రం మౌనంగానే ఉంటోందని కేటీఆర్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రమాదంపై ఆగమేఘాలపై స్పందించిన కేంద్రం మొన్నటి సుంకిశాల, నిన్నటి ఎస్ఎల్బీసీ ప్రమాదంపై ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డిని బీజేపీ కాపాడుతోందనేది మిలియన్ డాలర్ వ్యవహారంలా మారిందని అన్నారు. సరైన సమయంలో బీజేపీలో చేరతానని రేవంత్ హామీ ఇచ్చినందునే కేంద్రం ఆయనను కాపాడుతోందనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు.

## పాక్ పై భారత్ చిరస్మరణీయ విజయం

49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం, 242 పరుగుల లక్ష్యఛేదనలో టీమిండియా సునాయాసంగా విజయాన్ని అందుకుంది. కేవలం 4 వికెట్లు కోల్పోయి 42.3 ఓవర్లలో 244 పరుగులు చేసింది.టీమిండియా ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచిన కోహ్లీ 111 బంతుల్లో సరిగ్గా 100 పరుగులు చేశాడు. కోహ్లీ ఇన్నింగ్స్ లో 7 ఫోర్లు ఉన్నాయి. విన్నింగ్ షాట్ ఫోర్ కొట్టిన కోహ్లీ అటు సెంచరీ పూర్తి చేసుకోవడమే కాకుండా, ఇటు జట్టుకు విజయాన్ని అందించాడు. కోహ్లీకిది వన్డేల్లో 51వ సెంచరీ కాగా, పాకిస్థాన్ పై నాలుగోది. అంతకుముందు, కెప్టెన్ రోహిత్ శర్మ 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్ తో 20 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ శుభ్ మన్ గిల్ 46, శ్రేయాస్ అయ్యర్ 56 పరుగులు చేశారు. హార్దిక్ పాండ్యా 8 పరుగులకే వెనుదిరిగినా అక్షర్ పటేల్ (3 నాటౌట్) తో కలిసి కోహ్లీ మిగతా పని పూర్తి చేశాడు. పాక్ బౌలర్లలో షహీన్ అఫ్రిది 2, అబ్రార్ అహ్మద్ 1, కుష్ దిల్ షా 1 వికెట్ తీశారు. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ దశలో టీమిండియాకు ఇది వరుసగా రెండో విజయం కాగా పాకిస్థాన్ కు వరుసగా రెండో ఓటమి. ఈ ఓటమితో పాక్ సెమీస్ అవకాశాలు బాగా దెబ్బతిన్నాయి. గ్రూప్-ఏలో తాను ఆడిన రెండు మ్యాచ్ ల్లో విజయాలతో టీమిండియా టాప్ లో ఉంది. పాక్ అట్టడుగున ఉంది. రెండో స్థానంలో న్యూజిలాండ్, మూడో స్థానంలో బంగ్లాదేశ్ ఉన్నాయి. టీమిండియా తన చివరి లీగ్ మ్యాచ్ ను న్యూజిలాండ్ తో మార్చి 2న ఆడనుంది.

## ఇస్రోపై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం

ఈ సందర్భంగా గతంతో పోలిస్తే ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల సంఖ్య పెరగడం అభినందనీయమన్నారు. ఏఐ రంగంలోనూ భారత్ మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కైలాష్ ను మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. గిరిజన భాషలను పరిరక్షించడంలో సాయం చేశారంటూ కొనియాడారు. ఏఐను ఉపయోగించి కొలామి భాషలో కైలాష్ పాటను కంపోజ్ చేశారని ప్రధాని ప్రశంసించారు.

### పెరుగుతున్న ఏఐ వినియోగం

ఏఐ వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఈ టెక్నాలజీని ఉపయోగించుకుని దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని మోదీ అన్నారు. ప్రతి నెలా ఆఖరి ఆదివారం నిర్వహించే 'మన్ కీ బాత్'లో నేడు ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధ వినియోగం గురించి ఆయన ప్రస్తావించారు. తెలంగాణలో ఓ ఉపాధ్యాయుడి కృషిని ఆయన అభినందించారు. అంతరిక్ష రంగంలో ప్రతి ఏటా సాధిస్తున్న పురోగతిని కొనియాడారు. ఇస్రో 100 వ రాకెట్ ప్రయోగాన్ని సక్సెస్ ఫుల్ గా పూర్తి చేయడం దేశానికి గర్వకారణమన్నారు. అంతరిక్షశాస్త్ర సరిహద్దులను అధిగమించాలనే దేశ బలమైన సంకాల్పానికి ఈ కృషి నిదర్శనమన్నారు. 10ఏళ్లలో సుమారు 460 ఉపగ్రహాలను లాంచ్ చేసినట్లు తెలిపారు. అంతరిక్ష రంగంలో ప్రతేడాది కొత్త పురోగతి సాధిస్తున్నందుకు ఇస్రోను అభినందించారు. చంద్రయాన్ ప్రయోగం విజయం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంపై యువత కూడా ఆసక్తి చూపాలన్నారు.

### పెరుగుతున్న వారి భాగస్వామ్యం

ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల భాగస్వామ్యం పెరగడం ఇటీవలి విజయాలలో ఒకటి అని ఆయన అన్నారు. ఇటీవల నేను ఏఐ సదస్సులో పాల్గొనడానికి పారిస్ వెళ్ళాను. కృత్రిమ మేధస్సు రంగంలో భారతదేశం సాధించిన పురోగతిని ప్రపంచం ప్రశంసించింది. ఇటీవల, తెలంగాణలోని ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు తొడసం కైలాష్ గిరిజన భాషలను పరిరక్షించడంలో మాకు సహాయం చేశాడు. ఏఐ సాధనాలను ఉపయోగించి కొలామి భాషలో ఒక పాటను కంపోజ్ చేశానని మోదీ అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, వారి జీవితాలకు స్ఫూర్తినిచ్చేందుకు ఒక రోజు తన సోషల్ మీడియా ఖాతాను వారికి అంకితం చేస్తానని ఆయన అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, రాజ్యాంగ రూపకల్పనలో మహిళల పాత్రను ఆయన ప్రశంసించారు.

## అప్పుల బాధలు తాళలేక..
## ఇద్దరు పిల్లలు సహా భార్యాభర్తల అదృశ్యం

**శంషాబాద్ రూరల్ :** అప్పుల బాధలు తాళలేక ఇద్దరు పిల్లలతో సహా భార్యాభర్తలు అదృశ్యమైన ఘటన ఆదివారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది.సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన డి సుదర్శన్(41)కు కొన్నేండ్ల క్రితం కర్మన్‌ఘాట్‌కు చెందిన తేజస్విని(36)తో వివాహమైంది. ఈ దపంతులకు జయవర్ధన్(12), ఆదిత్యవర్ధన్(10) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇక సుదర్శన్ వినుత్న మోటార్స్‌లో ప్రైయివేటు ఉద్యోగం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. పెళ్లాయ్యక కొన్నాళ్లు కర్మన్‌ఘాట్‌లో ఉన్నారు. ఆ తర్వాత శంషాబాద్‌కు మకాం మార్చారు. అప్పులు అధికమవడంతో 3 సంవత్సరాల క్రితం శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామానికి చేరుకొని అక్కడ ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు.వెంకటాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి వద్ద 2 లక్షల చిట్టి ఎత్తుకొని పద్దులు చెల్లించడంలేదు. దీంతో సదరు వ్యక్తి నర్కూడ గ్రామంలోని అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో ఇంటి యాజమానికి అడిగితే ఈ నెల 18వ తేదీన బయటికి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. చిట్టి వ్యాపారి సుదర్శన్ తల్లికి విషయం చెప్పడంతో ఆమె నర్కూడ గ్రామానికి చేరుకొని అద్దె ఇంటి యాజమానితో పాటు చుట్టు పక్కల వారిని ఎవ్వరికి అడిగిన బాధిత వ్యక్తి ఆచూకీ తెలియలేదు. ఫోన్ చేసినా అతడి ఫోన్ కలవకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రతిరోజూ వృథాగా పోతున్న నీరు..
## ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

**పోచారం:** పోచారం మున్సిపాలిటీ లక్ష్మీనరసింహ కాలనీలో ప్రతిరోజు తాగునీరు వృథా అవుతుంది. వేసవి నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటూ ఉంటే.. ఇక్కడ మాత్రం ప్రతిరోజూ నీటి ట్యాంకు నుంచి గంటల తరబడి వృథాగా పోతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరా కోసం లక్ష్మీనరసింహ కాలనీలోని వాటర్ ట్యాంక్‌ను నింపి.. అక్కడి నుంచి వాల్స్ ద్వారా చుట్టుపక్కల ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తారు. ట్యాంక్ నిండిన తర్వాత వెంటనే వాటర్ మ్యాన్ వాల్స్ ద్వారా నీటిని ఇండ్లకు పంపిణీ చేస్తే నీటి వృథా సరగదు. కానీ వాటర్‌మ్యాన్ మాత్రం విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాడు. నీటి సరఫరాను సరిగ్గా పట్టించుకోకపోవడంతో ట్యాంక్ నిండిన తర్వాత గంటల తరబడి నీరు వృథాగా పోతుంది. కొద్దిరోజులుగా ఇలాగే ట్యాంక్ నుంచి నీరు వృథాగా వెళ్లిపోతుంది. దీని గురించి వాటర్‌మ్యాన్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఇదిలా ఉంటే.. ట్యాంక్ నిండిపోయిన తర్వాత నీళ్లు పక్కనే ఉన్న అంగన్‌వాడీ స్కూల్ భవనంపై పడుతున్నాయి. దీంతో పిల్లలు, టీచర్లు ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి ట్యాంక్ నుంచి కిందవరకు ఒక పైప్ ఏర్పాటుచేస్తే.. నిండిపోయిన తర్వాత స్కూల్ భవనంపై వాటర్ పడకుండా ఉంటుందని కూడా స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## యువత ముందడుగు వేయాలి
### - ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**పహాడి షరీఫ్ :** సమాజాన్ని అభివృద్ధి వైపు నడిపించడానికి యువత ముందుండాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. ఆదివారం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ వాదే ఉమర్ కాలనీలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్‌ను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబిత మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా శారీరక వ్యాయామం, క్రీడారంగాలపై దృష్టి మరల్చి సమాజంలో మంచి గుర్తింపు సాధించాలన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ అబ్దుల్లా సాధి, మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, శంషుద్దీన్, దస్తగిరి, హమీద్ అలీ, మన్సూరి, మిరాజ్ భాయ్, మతిన్ పటేల్, సయ్యద్ జిషన్, మగ్దూం బాయ్, మాహేశ్వరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, జల్ పల్లి సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

## పొలంలో యూరియా చల్లుతుండగా కరెంట్ షాక్..
## కొడుకును కాపాడబోయి రైతు మృతి



**శామీర్ పేట :** విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణాన్ని బలికొంది. వ్యవసాయ పొలంలో యూరియా మందు చళ్ళుతుండగా కొడుకుకు విద్యుత్ షాక్ తగలగా కాపాడే ప్రయత్నంలో తండ్రి మృత్యువాత పడిన సంఘటన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం అనంతారం గ్రామానికి చెందిన బుద్ది వెంకటేశ్( 40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పంట పొలానికి యూరియా చల్లేందుకు ఆదివారం తన కుమారుడు సృజన్‌ను తీసుకుని వెళ్లాడు. తండ్రి యూరియా చల్లుతుంటే కొడుకు గంపలో యూరియా అందిస్తున్నాడు. ఈ క్రమంలో వరి గట్టుపై నడుస్తున్న సమయంలో సృజన్‌ను ఎత్తుకున్న గంప.. పొలంలో వెళ్లాడుతున్న విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో సృజన్ ఒక్కసారిగా కేకలు వేశాడు. ఈ క్రమంలో కొడుకును కాపాడేందుకు వెళ్లిన వెంకటేశ్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించిన స్థానికులు ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వెంకటేశ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇక ఈ ప్రమాదంలో సృజన్ భుజంపై ఎముక విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, విద్యుత్ వైర్ల సమస్యపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల నుంచి స్పందన లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ వైర్ల సమస్యను స్పందించాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.

## మంత్రి మేనల్లుడు, పూల వ్యాపారి మధ్య ఘర్షణ..



**లక్నో:** వీధిలో రద్దీ నేపథ్యంలో మంత్రి మేనల్లుడు, పూల వ్యాపారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఒకరినొకరు కొట్టుకున్నారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ రాజీపడ్డారు. అయితే వారు కొట్టుకున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 22న బీజేపీకి చెందిన మంత్రి సోమేంద్ర తోమర్ మేనల్లుడు నిఖిల్ తోమర్, పూల షాపులతో ఇరుకుగా ఉన్న వీధిలో మహీంద్రా స్కార్పియోను డ్రైవ్ చేశాడు. ఎదురుగా ఈ ఆటో రావడంతో వాహనాన్ని నిలిపాడు.కాగా, వాహనం వెళ్లేందుకు దారి లేకపోవడంతో అక్కడున్న ఒక పూల వ్యాపారితో నిఖిల్ వాగ్వాదానికి దిగాడు. మాటా మాటా పెరుగడంతో ఇది ఘర్షణకు దారి తీసింది. దీంతో నిఖిల్ ఆ వ్యాపారిని కొట్టగా అతడు ప్రతిఘటించాడు. ఆ వ్యాపారికి చెందిన మహిళ కూడా నిఖిల్‌పై తిరగబడింది. దీంతో ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. ఆ తర్వాత నిఖిల్ తన వాహనంలో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మరోవైపు ఈ సంఘటన తర్వాత ఇరువర్గాల వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పరస్పరం ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే కొందరు వ్యక్తుల ప్రమేయంతో వారు రాజీపడ్డారు. ఈ నేపథ్యంలో ఎవరి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. అయితే ఈ ఘర్షణకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.


## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం
### - మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి



**కొల్లాపూర్:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇవాళ కొల్లాపూర్ పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పనులు జరిగినా ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని గుర్తు చేశారు.హడావిడిగా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకుండా టార్గెట్‌తో ఒత్తిడి పెట్టి పని చేయించడంతోనే ప్రమాదం జరిగినట్లు ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్య పూరిత వైఖరితో ఉద్యోగులు కార్మికులు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టన్నెల్‌లో బోరింగ్ మిషన్ పాడైనట్లు తెలిసినా ఎందుకు పనులు చేయించినట్లు అని ఆయన ప్రశ్నించారు.లూస్‌గా ఉండే పైకప్పు ప్రాంతాన్ని రాడార్ లాంటి పరిజ్ఞానం వాడి గుర్తించకుండా సిపేజీ క్లియర్ చేయకుండా కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టి పనులు చేయించారన్నారు. ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.కోటి రూపాయలు పరిహారం ఇచ్చి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి పూర్తిగా కోరుకునే వారికి వైద్య సాయం అందించి రూ.50 లక్షల సహాయాన్ని అందించాలన్నారు. ప్రమాదంపై స్వతంత్ర కమిటీతో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఎయిర్ పోర్ట్ నుంచి 40 నిమిషాల్లో ఫ్యూచర్ సిటీకి

## - గ్రీన్ కారిడార్ లో మెట్రో ఎండీ క్షేత్ర స్థాయి పరిశీలన






**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ లతో పాటు నాలుగో సిటీగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఇది కాలుష్యరహిత గ్రీన్ సిటీ గా ప్రపంచంలోనే అద్భుత నగరాల సరసన చేరాలని ఆయన ఆకాంక్షించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ సంస్థ హెచ్ఎండీఏ, టీజీఐఐసీ లతో కలిసి మెట్రో రైల్ విస్తరణ ప్రణాళికలు రూపొందిస్తోంది.

### - కాలుష్యరహిత నగరంగా ఫ్యూచర్ సిటీ

ఫ్యూచర్ సిటీకి అనువుగా గ్రీన్ కారిడార్ లను అభివృద్ధి చేసి, అంతర్జాతీయ విమానాశ్రయం నుండి వేగంగా, సులభంగా ఫ్యూచర్ సిటీకి చేరుకునే ప్రణాళిక ఉండాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అది వాస్తవరూపం దాల్చేందుకు కసరత్తు చేస్తున్నామని, దాదాపు పదిహేను వేల ఎకరాలలో విస్తరించనున్న ఫ్యూచర్ సిటీని కాలుష్యరహిత నగరంగా రూపొందించడంలో, దానికి అంతర్జాతీయ స్థాయి ప్రయాణ సౌకర్యాలు కల్పించడంలో మెట్రో రైలుతో కూడిన ఈ గ్రీన్ కారిడార్ ప్రముఖ పాత్ర వహిస్తుందని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎయిర్ పోర్ట్ నుండి మీర్ ఖాన్ పేట్ లో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డీపీఆర్ తయారీకై జరుగుతున్న సర్వే పనులను మెట్రో ఎండీ ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో పరిశీలించారు. కొంగర కలాన్ దాటిన తరువాత ప్రస్తుతం రోడ్ లేకపోవడం వల్ల కాలినడకన ఆయన ఈ క్షేత్ర పర్యటన జరిపారు.

### - ఎయిర్ పోర్ట్ నుండి రావిర్యాల మీదుగా గ్రీన్ కారిడార్ మెట్రో రైల్

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం దాదాపు 40 కిలోమీటర్లు ఉంటుంది. ఎయిర్ పోర్ట్ టెర్మినల్ నుండి మొదలై, కొత్త మెట్రో రైల్ డిపో పక్క నుండి ఎయిర్ పోర్ట్ వెంబడి ఎలివేటెడ్ మార్గంగా మన్సాన్ పల్లి గుండా 5 కిలోమీటర్లు ముందుకు సాగాక పెద్ద గొల్కోండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ కి చేరుతుందని మెట్రో ఎండీ తెలిపారు. బహదూర్ గుడాలో ఉన్న దాదాపు 1000 నుండి 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్ గుడా, పెద్ద గోల్కొండలలో రెండు మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తామని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుండి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల్ ఎగ్జిట్ వరకు దాదాపు 14 కిలోమీటర్ల పొడవున ఈ మెట్రో మార్గాన్ని ఎలివేటెడ్ మెట్రో మార్గంగా ఓఆర్ఆర్ లో మెట్రో రైల్ కి కేటాయించిన భాగంలో తక్కువ ఎత్తులో నిర్మిస్తామని ఆయన తెలిపారు.

### - రహదారికి ఇరువైపులా రెండు సర్వీస్ రోడ్లు

రావిర్యాల ఎగ్జిట్ నుండి ఇప్పటికే నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు దాదాపు 22 కిలోమీటర్లు కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగుడా, మీర్ ఖాన్ పేట్ వరకు హెచ్ఎండీఏ 100 మీటర్లు (328 అడుగులు) వెడల్పున నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్లు (72 అడుగులు) మెట్రో రైల్ కి కేటాయించారు. ఈ రోడ్ మధ్య స్థలంలో మెట్రో రైల్ కారిడార్ 'ఎట్ గ్రేడ్' (భూ తలంపై) మెట్రోగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఈ రోడ్ మధ్య లో అదే లెవెల్ లో మెట్రో రైల్ ఉంటే దానికి ఇరువైపులా మూడు లేన్ల ప్రధాన రహదారి ఉంటుంది. మెట్రోను, ప్రధాన రహదారిని విభజిస్తూ చెట్లను, గ్రీనరీని అభివృద్ధి చేస్తామని, ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఓఆర్ఆర్ నిర్మిస్తున్నప్పుడు ఓఆర్ఆర్ లో అంతర్భాగంగా భవిష్యత్ లో నిర్మించబోయే మెట్రో కి తగినంత స్థలాన్ని కేటాయించాలన్న అప్పటి తన ప్రతిపాదనతో 20 మీటర్లు మెట్రోకి కేటాయించినట్లు తెలిపారు. ఓఆర్ఆర్, మెట్రో వంటి బృహత్ ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితమవుతాయని, అప్పట్లో అనేక మంది అపహాస్యం చేసినా.. ఓఆర్ఆర్, మెట్రో రెండూ కూడా కార్యరూపం దాల్చాయన్నారు. వీటివల్ల హైద్రాబాద్ కు మరింత ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మెట్రో ఎండీ అన్నారు. ప్రపంచంలో ప్రప్రథమంగా 22 వేల కోట్ల రూపాయలతో మెట్రో మొదటి దశను 69 కిలోమీటర్ల మేర పీపీపీ పద్ధతిన విజయవంతంగా పూర్తి చేసాం. అదే విధంగా ఈ ప్రణాళికలను కూడా రేవంత్ రెడ్డి దార్శనికతతో కార్యరూపం దాల్చేలా హెచ్ఎండీఏ, టీజీఐఐసి, మెట్రో రైల్ సంస్థలు సంయుక్తంగా కృషి చేస్తాయని అన్నారు. నార్త్ సిటీ లోని మేడ్చల్, శామీర్ పేట్ కారిడార్లతో పాటు, ఈ ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్ డీపీఆర్ కూడా ఈ మార్చి నెలాఖరుకు పూర్తి చేసి, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి వీటిని సమర్పిస్తామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

# వైభవంగా శ్రీ భద్రావతి సమేత భావన ఋషి స్వామి కళ్యాణ వేడుక



**మధిర :** మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భద్రావతి సమేత భావన ఋషి స్వామి వారి కళ్యాణాన్ని వైభవోపేతంగా ఇవాళ అంగరంగ వైభవంగా వేడుకగా నిర్వహించారు. పద్మశాలీల ఆరాధ్య దైవమైన శ్రీ భద్రావతి భావన రుషి స్వామి కళ్యాణాన్ని తిలకించడానికి వివిధ గ్రామాల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కళ్యాణం అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదములను అందజేశారు. కళ్యాణ వేడుకకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఎలమద్ది రాము, బిట్రా ఉద్దండయ్య, పొడుగు వెంకటేశ్వర్లు, జిల్లా నరసింహారావు, ఎన్ఆర్ఐ జల్లా రామకృష్ణ, మిడిదిడ్డి వెంకటనారాయణ, మడిపల్లి గ్రామ పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అమ్మ సెంటిమెంట్‌తో ఇప్పటికే ఇండస్ట్రీలో చాలా సినిమాలే కాదు.. పాటలు కూడా వచ్చాయని తెలిసిందే. చాలా రోజుల తర్వాత మళ్లీ ఇదే జోనర్‌లో వస్తున్న చిత్రం మాతృ (%మీఫ్‌తీబ%). జాన్ జక్కీ దర్శకత్వం వహిస్తున్నాడు. శ్రీరామ్, నందినీ రాయ్, సుగి విజయ్, రూపాలి భూషణ్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శ్రీపద్మిని సినిమాస్ బ్యానర్‌పై శ్రీ పద్మ సమర్పణలో బి శివప్రసాద్ నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా నుంచి అపరంజి బొమ్మ.. మా అమ్మ పాటను ఇటీవలే లాంచ్ చేశారు. దినేశ్ రుద్ర పాడిన ఈ పాటకు అద్భుతమైన స్పందన వస్తోంది. మదర్ సెంటిమెంట్‌తో అందరి హృదయాల్ని కరిగించేలా సాగుతూ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలుస్తుంది.

# ఉద్యమ నేత కేసీఆర్ అభిమానికి ఎమ్మెల్సీ కవిత చేయూత




**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను, పార్టీ అధినేత కేసీఆర్ అభిమానులకు ఎప్పుడూ అండగా నిలిచే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఓ కార్యకర్తకు చేయూతను అందించి మరోసారి గొప్ప మనసు చాటుకున్నారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రామానుజాపురం గ్రామానికి చెందిన చిర్రా సతీష్ కుటుంబం 2001లో పార్టీ ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్ కార్యకర్త, కేసీఆర్ వీరాభిమాని. చిన్ననాటి నుంచి వినికిడి సమస్య ఉన్న సతీష్ డిగ్రీ పూర్తి చేశారు. అయితే, స్వయం ఉపాధి కోసం జిరాక్స్ మిషన్, లాప్‌ట్యాప్ ఇప్పిస్తే స్వయం ఉపాధి పొందుతానని ఇటీవల కేసీఆర్ జన్మదినం రోజున ఎమ్మెల్సీ కవితకు సతీష్ మెసేజ్ చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆయన స్వయం ఉపాధి కావలసినవి సమకూర్చారు. జిరాక్స్ సెంటర్ ఏర్పాటు చేసుకోవడానికి సహకారం అందించడమే కాకుండా ఆమెనే స్వయంగా ప్రారంభించబోతున్నారు. మరోవైపు, సోమవారం నాడు ఎమ్మెల్సీ కవిత మహబూబాబాద్ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రామానుజపురంలో జిరాక్స్ సెంటర్ ప్రారంభించిన అనంతరం మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో తెలంగాణ జాగృతి నాయకురాలు మరిపెల్లి మాధవి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరవుతారు. కురవి వీరభద్ర స్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడ పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతారు. అన్నారంలో గాయకుడు మానుకోట ప్రసాద్ ఇంటిని సందర్శిస్తారు. అనంతరం కేసముద్రం మిర్చి యార్డ్‌ను సందర్శిస్తారు. దాంతో, మహబూబాబాద్ జిల్లా పర్యటనను ముగించుకొని భూపాలపల్లి జిల్లాకు వెళ్లి అక్కడ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాడ హరీష్ రెడ్డి వివాహానికి హాజరవుతారు.

# చెరువులో చేపలు పట్టినవారిపై చర్యలు తీసుకోండి.. నిజాంపేట పీఎస్‌లో బచ్చురాజ్‌పల్లి మత్స్యకారుల ఫిర్యాదు




**నిజాంపేట :** అక్రమంగా చెరువులో చేపలు పట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బచ్చురాజ్ మత్స్యకారులు(ముదిరాజ్) నిజాంపేట ఎస్సై శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ.. బచ్చురాజ్‌పల్లి మత్స్య సొసైటీ పరిధిలో జెడ్‌చెర్వు తండాలోని చెరువు ఉండగా.. రమావత్ రాజు, రమావత్ రామోజీ, రమావత్ శ్రీనివాస్‌లు అక్రమంగా తమ చెరువులో వలలు వేసి చేపలు పట్టారని మండిపడ్డారు. చేపల పెంపకంతో జీవనోపాధి పొందుతున్న మాలాంటి మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. అక్రమంగా చేపలు పట్టినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మత్స్యకారుల(ముదిరాజ్) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్, బచ్చురాజుపల్లి గ్రామ మత్స్యకారులు రాజు, స్వామి, మల్లేశం, శ్రీనివాస్, రవి, లింగం, మల్లయ్య, చంద్రం, బాలయ్య, శంకర్, సాయిలు, మహేశ్, యాదగిరి, ఎల్లం తదితరులు ఉన్నారు.

# టీటీడీ బోర్డు ఎక్స్‌అఫిషియో సభ్యునిగా దేవాదాయశాఖ సెక్రటరీ ప్రమాణం

**తిరుమల :** టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా దేవాదాయ శాఖ సెక్రటరీ వి.వినయ్ చంద్ ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. వి.వినయ్ చంద్‌కు శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అదనపు ఈవో అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు భాస్కర్, ప్రశాంతి, వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.

**తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..**

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 21 కంపార్టుమెంట్లలో వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో స్వామివారి దర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 78,110 మంది భక్తులు దర్శించుకోగా 30,020 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 3.39 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

# నిమ్మకాయ నీళ్లను తాగుతున్నారా..? అయితే కచ్చితంగా ఈ నియమాలను పాటించాల్సిందే..!

అధిక బరువు తగ్గడం ఎంత కష్టంగా ఉంటుందో అందరికీ తెలిసిందే. బరువు పెరగడం సులభమే. కానీ తగ్గించుకోవడమే కష్టం. 1 కిలో బరువు పెరిగేందుకు 3 రోజులు చాలు. కానీ తగ్గేందుకు 10 రోజులు శ్రమించాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బరువును తగ్గించుకునేందుకు చాలా మంది అనేక రకాల పద్ధతులను పాటిస్తుంటారు. జిమ్‌లో వ్యాయామం చేయడంతోపాటు డైట్ విషయంలోనూ జాగ్రత్తలను తీసుకుంటారు. ముఖ్యంగా బరువును తగ్గించుకునేందుకు పలు ప్రత్యేక పానీయాలను కూడా సేవిస్తుంటారు. అలాంటి పానీయాల్లో నిమ్మకాయ నీళ్లు కూడా ఒకటి. చాలా మంది ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త నిమ్మరసం, తేనె కలిపి తాగుతుంటారు. దీని వల్ల శరీర మెటబాలిజం పెరిగి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. కానీ నిమ్మకాయ నీళ్లను తాగాలని అనుకుంటున్న వారు పలు సూచనలు పాటించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

### ఉప్పు, చక్కెర వద్దు..

నిమ్మకాయ నీళ్లలో చాలా తక్కువ క్యాలరీలు ఉంటాయి. నిమ్మకాయ నీళ్లను రోజూ తాగడం చాలా సులభం. సింపుల్ గా నీళ్లను కాస్త వేడి చేసి అందులో నిమ్మరసం, తేనె కలిపి తాగేయడమే. ఈ నీళ్ల వల్ల కేవలం 6 క్యాలరీలు మాత్రమే లభిస్తాయి. అందుకనే బరువును తగ్గించడం కోసం ఈ నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. అయితే కొందరు ఈ నీటిలో తేనెకు బదులుగా చక్కెర కలిపి తాగుతుంటారు. బరువు తగ్గాలని చూస్తున్నవారు ఎట్టి పరిస్థితిలోనూ నిమ్మకాయ నీళ్లలో చక్కెర కలపకూడదు. అలా కలిపి తాగితే ఈ నీళ్లను తీసుకుని కూడా ప్రయోజనం ఉండదు. బరువు తగ్గాలనుకునే మీ కోరిక నెరవేరదు. ఇక కొందరు ఈ నీళ్లలో ఉప్పు కలిపి తాగుతారు. ఉప్పును కూడా కలపకూడదు. ఎండవల్ల మీ శరీరం డీహైడ్రేషన్ బారిన పడితేనే అలాంటి సందర్భంలోనే నిమ్మకాయ నీళ్లలో ఉప్పు, చక్కెర కలిపి తాగాలి. అంతేకానీ బరువు తగ్గడం కోసం ఉపయోగించే నిమ్మకాయ నీళ్లలో ఉప్పు, చక్కెర కలపకూడదు.

### అదే పనిగా తాగకూడదు..

ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని చెప్పి కొందరు అదే పనిగా ఈ నీళ్లను తాగుతుంటారు. అలా ఎట్టి పరిస్థితిలోనూ ఈ నీళ్లను సేవించకూడదు. రోజుకు 1 లేదా 2 సార్లు తాగాలని మాత్రమే నియమం పెట్టుకోవాలి. అన్నే సార్లు తాగాలి. లేదంటే శరీరంపై నెగెటివ్ ప్రభావం పడుతుంది. నిమ్మకాయ నీళ్లను తయారు చేసేందుకు ఉపయోగించే నీళ్లు చాలా శుభ్రంగా ఉండాలి. అవి ఫిల్టర్ అయిన నీళ్లు అయి ఉండాలి. బయటి నుంచి కొందరు 20 లీటర్ల క్యాన్లను తెచ్చుకుని ఆ నీళ్లను ఉపయోగిస్తారు. ఆ నీళ్లు మంచివే. కానీ ఆ నీళ్లను అయినా సరే ఫిల్టర్ చేయాల్సి ఉంటుంది. లేదంటే నీళ్లతో నిమ్మరసం రసాయన చర్య జరుపుతుంది. అప్పుడు నీళ్లు మారిపోతాయి. అలాంటి నీళ్లను తాగినా ప్రయోజనం ఉండదు.

### గ్యాస్ ట్రబుల్ ఉంటే..

నిమ్మకాయ ఆరోగ్యానికి ఉపయోగపడుతుందని చెప్పి కొందరు నేరుగా నిమ్మరసాన్ని సేవిస్తుంటారు. ఇలా చేయడం హానికరం. ఎందుకంటే నిమ్మకాయ రసంలో ఆమ్ల గుణాలు ఉంటాయి. ఇవి దంతాలకు నేరుగా తాకితే దంతాలపై ఉండే ఎనామిల్ పొర కరిగిపోతుంది. దీంతో దంతాలు బలహీనంగా మారుతాయి. పెళుసుగా మారి విరిగిపోతాయి. దంత క్షయం ఏర్పడే ప్రమాదం ఉంటుంది. కనుక నిమ్మరసాన్ని ఎల్లప్పుడూ నీళ్లలో కలిపి మాత్రమే తాగాలి. గ్యాస్ ట్రబుల్ సమస్య ఉన్నవారు ఈ నీళ్లను ఎట్టి పరిస్థితిలోనూ పరగడుపున సేవించకూడదు. ఈ నీళ్లను తాగాలనుకుంటే ఉదయం అల్పాహారం చేసిన తరువాత 40 నిమిషాలు ఆగి ఆ తరువాత తాగవచ్చు. ఆహారం తింటానికి ముందు లేదా తిన్న వెంటనే కూడా ఈ నీళ్లను సేవించకూడదు. లేదంటే మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకోలేదు. ఇలా నిమ్మకాయ నీళ్లను తాగే విషయంలో పలు సూచనలను పాటించాల్సి ఉంటుంది. దీంతో ఈ నీళ్లతో ప్రయోజనాలను పొందవచ్చు.

# లోకేష్ మోసపూరిత ప్రకటన, చంద్రబాబు ఆడియో లీకులతో డ్రామా

## వైఎస్ జగన్ ఫైర్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని, తాజాగా గ్రూప్ 2 అభ్యర్థులు గత కొన్ని రోజులుగా ఎదుర్కొన్న పరిస్థితే అందుకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ అంటోంది. గ్రూప్ 2 అభ్యర్థులకు న్యాయం చేస్తానని మంత్రి లోకేష్ మోసపూరిత చేశారని, చివరికి మీ వాయిస్‌తో ఆడియోను లీక్ చేస్తూ మరో డ్రామా చేశారంటూ ఏపీ సీఎం చంద్రబాబుపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిప్పులు చెరిగారు. పలు అంశాలను ప్రస్తావిస్తూ ఏపీ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

1. చంద్రబాబు నిరుద్యోగులను, ఉద్యోగులనే కాదు అన్నివర్గాల ప్రజలనూ మోసం చేయడమే అలవాటుగా మార్చుకున్నారు. ఇప్పుడు గ్రూప్–2 అభ్యర్థులనుకూడా నిలువునా మోసం చేశారు.
2. మూడు వారాలుగా గ్రూప్–2 అభ్యర్థుల అభ్యంతరాలను వింటున్నట్టు నటించి, వాటిని పరిగణలోకి తీసుకుని తగిన న్యాయం చేస్తున్నట్టు నమ్మబలికి, చివరకు వారిని నట్టేటా ముంచారు. అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞాపనలను వింటున్నానని, తప్పకుండా పరిష్కారం చూపిస్తానని పరీక్షలకు రెండు రోజులముందు విద్యాశాఖమంత్రి, మీ కుమారుడు నారా లోకేష్ మోసపూరిత ప్రకటన చేశారు, మరోవైపు తాను చెప్పినా సరే, ప్రభుత్వం నుంచి లేఖ ఇచ్చినా సరే పట్టించుకోకుండా ఏపీపీఎస్సీ ముందుకు వెళ్తోందని సాక్షాత్తూ ముఖ్యమంత్రిగా ఉన్న మీ వాయిస్‌తో ఆడియోను లీక్ చేస్తూ మరో డ్రామా చేశారు. ఇంకోవైపు ఆందోళన చేస్తున్నవారిపై పోలీసులతో లాఠీఛార్జి చేయించి అమానుషంగా ప్రవర్తించారు. ప్రజలను ఎలా మోసం చేస్తారో చెప్పడానికి ఇది మరొక ఉదాహరణ మాత్రమే. ఆఖరికి అయోమయం, గందరగోళం, అస్పష్టత మధ్యే పరీక్షలు పెట్టడం అత్యంత దారుణం.
3. మా ప్రభుత్వంలో ఇచ్చిన డీఎస్సీని రద్దుచేసి మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా కాలయాపన చేయడం ఒక మోసమే.
4. ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి, అసలు దాని గురించి పట్టించుకోకపోవడం కూడా మీరు చేసిన మోసమే.
5. వాలంటీర్లకు పదివేలు ఇస్తానని చెప్పి, జీతం సంగతి దేవుడెరుగు చివరకు 2.6లక్షలమంది ఉద్యోగాలను ఊడగొట్టడమూ మోసమే.
6. గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది కుదింపు పేరిట, వీరిని వేరే డిపార్ట్‌మెంట్లకు సర్దుబాటు చేసి, అక్కడ ఖాళీలకు శాశ్వతంగా కోతపెట్టడమూ మోసమే.
7. నిరుద్యోగ భృతి అని, నెలనెలా రూ.3,000 అని, ప్రతి ఇంటినీ మోసం చేయడం, ఇంకో మోసం.
8. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగాలే ఉద్యోగాలు అంటూ ఊదరగొట్టి ఇప్పుడు ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో 18వేలమందిని, ఫీల్డ్ అసిస్టెంట్లనూ, ఫైబర్ నెట్ కార్పొరేషన్‌లోనూ, ఏపీ ఎండీసీలోనూ, వైద్య ఆరోగ్య శాఖలోనూ పనిచేస్తున్నవారిని తొలగించి వారి జీవితాలను నడిరోడ్డుపై నిలబెట్టడము కూడా మీరు చేస్తున్న మోసాల్లో భాగమే.
9. అధికారంలోకి రాగానే ఐఆర్ ఇస్తామన్న మీ హామీపై ఇప్పటికీ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఉద్యోగులకు చేస్తున్న మోసమే.
10. ఉద్యోగులకు మెరుగైన పీఆర్‌సీ అంటూ ఉన్న పీఆర్‌సీ ఛైర్మన్‌ను బలవంతంగా రాజీనామా చేయించి, కొత్త పీఆర్‌సీ ఇంతవరకూ వేయకపోవడమూ ఇంకో మోసమే.
11. ఒకటో తేదీనే జీతాలు అంటూ, ఒకే ఒక నెల మాత్రమే ఇచ్చి, ఆతర్వాత ప్రతినెలా ఉద్యోగులు ఎదురుచూసేలా చేయడం కూడా మీరు చేసిన మోసాల్లో భాగమే.
12. ఉద్యోగులకు ఇవ్వాల్సిన 3 డీఏలు పెండింగ్‌లో పెట్టడం



కూడా ఒక అన్యాయమే.
13. ట్రావెల్ అలవెన్స్‌లు, సరెండర్ లీవ్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్.. అన్నీ పెండింగ్‌లో పెట్టడంకూడా ఇంకో అన్యాయమే.
14. ఉద్యోగస్తులకు సంబంధించిన వారి జీఎల్ఐ, జీపీఎఫ్ కూడా మీ అవసరాలకు వాడేసుకుని ఉద్యోగులకు ఇబ్బందులు సృష్టించడం కూడా మీరు చేస్తున్న అన్యాయాల్లో భాగమే.
15. ఈ మోసాలకు, ఈ అన్యాయాలకు కేరాఫ్‌గా మారిన చంద్రబాబునాయుడు, మీ వైఖరిపై ప్రజలు ఇప్పటికే ఆగ్రహంతో ఉన్నారు, పోరాటాలు చేస్తున్నారు. ప్రజా పోరాటాలకు ఎప్పుడూ మా పార్టీ తోడుగా నిలుస్తుంది.

## మార్చి 10వరకూ గూడూరు ప్రింట్ మీడియా అసోసియేషన్ సభ్యత్వ నమోదు

### జర్నలిస్ట్ లు సద్వినియోగం చేసుకోవాలి



**గూడూరు (ప్రశ్న న్యూస్ )** ప్రభుత్వం ద్వారా రిజిష్టర్డ్ కాబడిన అసోసియేషన్ గా గూడూరు కేంద్రంగా జర్నలిస్ట్ ల సంక్షేమం, హక్కుల సాధనకు కృషి చేస్తున్న గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ వార్షిక సభ్యత్వ నమోదు ప్రక్రియ మార్చి 10వ తేదీ వరకూ జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్. జమాలుల్లా,ఉడతా శరత్ యాదవ్ లు తెలిపారు.ఆదివారం గూడూరు లో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ద్వారా జర్నలిస్ట్ ల సంక్షేమానికి అమలు చేసుకోవాల్సిన కార్యాచారణ పై సభ్యులు చర్చించారు.జర్నలిస్ట్ ల జీవన భద్రతకు ప్రమాద భీమా పునరుద్ధరణ చేయాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే సహకారం తో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు కృషి చే యడం,ప్రభుత్వ పరంగా జర్నలిస్ట్ ల కుటుంబాలకు అందాల్సిన సంక్షేమ పథకాలు లభించేలా ప్రయత్నిస్తామన్నారు.

అసోసియేషన్ లో కలసి పని చేయాలని ఆసక్తి వున్న జర్నలిస్ట్ సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు.గూడూరు డివిజన్ కేంద్రంగా ప్రింట్ మీడియా సంస్థలలో మాత్రమే విలేఖరులుగా పని చేస్తూ కనీసం మూడు సంవత్సరాలు అనుభవం వున్న జర్నలిస్ట్ లు సభ్యత్వ నమోదుకు అర్హులు అని తెలిపారు.సభ్యత్వ నమోదు కొరకు పర్యవేక్షకులు సీనియర్ జర్నలిస్ట్ పి. బాలకృష్ణ(7093694883), ట్రెజరర్ యు. శశిధర్(శశి)(9490945445)లను సంప్రదించి అసోసియేషన్ నియమావళి మేరకు సభ్యత్వం పొందాలన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు గా సీనియర్ జర్నలిస్ట్ బాబూ మోహన్ దాస్, గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ కు ఇప్పటి వరకూ గౌరవ సలహాదారుగా వ్యవహారిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ జీ బాబు మోహన్ దాస్ ను ఉపాధ్యక్షులుగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో గూడూరు ప్రింట్ మీడియా అసోసియేషన్ గౌరవ సలహాదారు మల్లవరపు మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పర్చూరు బాలకృష్ణ, జాయింట్ సెక్రటరీ భవానీ ప్రసాద్, సీహెచ్ ప్రసాద్, గుంటమడుగు సుబ్బరామ రాజు, నాని, శశి, ఉమా మహేశ్వర రావు, కిషోర్, జనార్ధన్, నరసింహులు, లక్ష్మణ్,ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ కే రాజగోపాల్ సంస్మరణ సభ: సిపిఎం

### సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ,మాజీ కార్పొరేటర్,కామ్రేడ్ రాజగోపాల్



**కర్నూల్ టౌన్ (ప్రశ్న న్యూస్ )** సంస్మరణసభ ను సోమ వారం, హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్ నందు నిర్వహిస్తున్నామని సిపిఎం పార్టీ నగర కార్యదర్శి, ఎం రాజశేఖర్ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎం డి షరీఫ్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం సిఐటియు ,ప్రజాతంత్ర ఉద్యమాలలో రాటు తేలిన నాయకుడని ,అనునిత్యం పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ,కార్మిక, కర్షక హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని ,చివరి శ్వాస వరకు ఆయన కమ్యూనిస్టు ఉద్యమాన్ని అంటు పెట్టు కొని ఉన్నాడని అటువంటి మహా నాయకుడు ఇటీవల కాలంలో మరణించారని, ఆయనను స్మరిస్తూ, నేడు సోమవారం సిపిఎం పార్టీ నాయకత్వంలో సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని, వారు తెలియజేశారు .ఈ సంస్మరణ సభకి సిపిఎం పార్టీ నాయకులు ,ప్రజాసంఘాల నాయకులు ,పేపర్ మిల్ కార్మిక సోదరులు, అలాగే సి ఐ టి యు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, సభ్యులు హాజరు కావాలని, మరిముఖ్యంగా రాజగోపాల్ అభిమానులు ,పార్టీ సానుభూతిపరులు ,హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా వారు కోరారు.

### నీటిని తోడుతూ.. బురదను తీస్తూ..

## ఆర్మీ రెస్క్యూ ఆపరేషన్



**మహబూబ్ నగర్ :** దోమలపెంట , శ్రీశైలం సమీపంలో సొరంగంలో పైకప్పు కూలిపోయిన తర్వాత లోపల చిక్కుకున్న వారిని రక్షించడానికి భారత సైన్యం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. రెస్క్యూ ఆపరేషన్‌కు తీవ్ర ఆటంకం కలుగుతుంది. నాగర్ కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (%యాదీజ%) సొరంగం పైకప్పు యొక్క ఒక భాగం కూలిపోయిన ఘటనపై అధికారులు ఇచ్చిన సమాచారంతో ఓ బ్లూప్రింట్ తయారు చేశారు.ఈ సంఘటనలో కార్మికులు లోపల చిక్కుకున్నట్లు భావిస్తున్న ప్రదేశాన్ని పాయింట్ ఔట్ చేశారు. ఇక్కడ నుంచి రెస్క్యూ ఆపరేషన్ ఏవిధంగా ఉండాలనే దానిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి రంగంలోకి దిగారు. స్విఫ్ట్ రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగుతున్నాయి..తెలంగాణ -ఆంధ్రా సబ్ ఏరియా రెస్క్యూ ఆపరేషన్లను సమన్వయం చేస్తుందని అధికార యంత్రాంగం ప్రకటించింది. సికింద్రాబాద్ నుండి బైసన్ డివిజన్ ఇంజనీర్ టాస్క్ ఫోర్స్ (%జుఖీ%) మోహరించారు. అధిక సామర్థ్యం గల పంపింగ్ సెట్లు, సాయుధ గొట్టాలు, ఎక్స్‌కావేటర్లు, జేసీబీ, బుల్డోజర్లతో కూడిన ఆర్మీ వైద్య బృందాలు, ఇంజనీర్లు శిధిలాలను తొలగించే పనిని యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారు.ప్రమాదం జరిగిన చోట తొలగింపు ప్రక్రియ ప్రారంభం అయిందని ఉన్నతాదికారి ఒకరు తెలిపారు. శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ఎన్డీఆర్ఎఫ్, ఏస్డీఆర్ఎఫ్ సైన్యం సొరంగం నిర్మాణ కాంట్రాక్టర్లతో కలిసి అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షిస్తున్నారు. రంగంలోకి దిగిన భారత సైన్యం సహాయక చర్యలను వేగవంతం చేయడంతో రెస్క్యూ ఆపరేషన్ వేగంగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోపల చిక్కుకున్న వారిని సురక్షితంగా వెలికితీయడం భారత సైన్యానికి సవాల్‌గా మారింది.

# శ్రీశైలంలో మహాశివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు

- ట్రాఫిక్ పై ప్రత్యేక నిఘా కొరకు డ్రోన్ కెమెరాల వినియోగం
- ట్రాఫిక్ నియంత్రణకు 20 బ్లూ కోట్స్ వాహనాలు 08 రక్షక్ వాహనాల ఎర్పాటు
- బ్రెక్ డౌన్ అయిన వాహనాల తొలగింపునకు టోయింగ్ వెహికల్స్ ఏర్పాటు

అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు





**నంద్యాల( ప్రశ్న న్యూస్)** శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సంధర్భంగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శన నిమిత్తం శ్రీశైలంనకు వచ్చు భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసేందుకు నంద్యాల జిల్లా ఇంచార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలమేరకు నంద్యాల అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా పోలీస్లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.శ్రీశైలం శిఖరం వద్ద నుండి వద్ద నుండి ముఖద్వారం, సాక్షి గణపతి, హటకేశ్వరం,రామయ్య టర్నింగ్ టోల్గేట్ మరియు శ్రీశైలం లోని పరిసర ప్రాంతాలలో శ్రీశైలం ముఖద్వారం నుండి సుండిపెంట,లింగాల గట్టు, తెలంగాణ బోర్డర్ వరకు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా సుమారు 800 మందిని ట్రాఫిక్ నియంత్రణ కొరకు నియమించడం జరిగిందన్నారు.

శ్రీశైలం శిఖరం దగ్గర నుండి శ్రీశైల పరిసర ప్రాంతాలు తెలంగాణ బోర్డర్ వరకు ట్రాఫిక్ నియంత్రణ కొరకు 08 రక్షక్ వాహనాలు సుమారు 20 బ్లూ కోట్స్ వాహనాలను అనగా సుమారు 40 మంది పోలీస్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహణ కొరకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా నియమించడం జరిగింది. ఎక్కడ ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 8 డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యమైన కూడళ్ల యందు పికెట్స్ లను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ కొరకు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగింది.

శ్రీశైలంనకు వచ్చు భక్తులకు పోలీసు సూచనలు చేసారు. దోర్నాల నుండి శ్రీశైలం వరకు ఘాట్ రోడ్డు ఉన్న కారణంగా మీరు వాహనాలలో వచ్చినప్పుడు నైపుణ్యం గల డ్రైవర్లను మీ వెంట తీసుకుని రావాలి. భారీ గూడ్స్ వాహనాలు శ్రీశైలం నకు అనుమతించబడవు. ముఖ్యంగా సాక్షి గణపతి రామయ్య టర్నింగ్ ల వద్ద రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపరాదు.

ఔటర్ రింగ్ రోడ్డు యజ్ఞశాల తదితర ప్రాంతాలలో ఆంధ్ర ,తెలంగాణ, కర్ణాటక ఇతర బస్సులు పార్కింగ్ కొరకు విశాలమైన ప్రదేశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఔటర్ రింగ్ రోడ్డు కొత్త పార్కింగ్ స్థలం నందు కార్లు తేలికపాటి వాహనాలు నిలుపుకొనుటకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం జరిగింది. వాహనాల పార్కింగ్ కొరకు ఏర్పాటుచేసిన స్థలంలో మాత్రమే మీ వాహనాలను నిలుపుకోవాలి. రోడ్డుకు ఇరువైపులా ఎట్టి పరిస్థితులలో వాహనాలు నిలుపరాదు.

ఎవరైనా రోడ్డుపై వాహనాలు నిలిపిన యెడల డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచి వాటిని పోలీస్ టోయింగ్ వాహనం ద్వారా ఇతర ప్రాంతాలకు తొలగించడం జరుగుతుంది.

# వామ్మో దొంగలు



### - వరుస దొంగతనాలతో భయపడుతున్న పట్టణవాసులు

### - తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దోపిడీ

**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** ఎప్పుడు వస్తారో, ఎటు నుంచి వస్తారో తెలియదు. తాళమేసిన ఇంటిని ఎలా కొల్లగొడుతున్నారో అర్ధం కాదు. సినిమా రేంజ్లో ప్లాన్ చేసి అందినకాడికి దోచుకుంటున్నారు దొంగలు. నాయుడుపేట లో ఇటీవల వరుసగా దొంగతనాలు పెరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దొంగతనాల ముఠా దిగిందేమోనన్న సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది.వరుస దొంగతనాలు జనం కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. నాయుడుపేట లో దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. పగలు రాత్రి తేడా లేదుతాళం వేసి ఎటైనా బయటకు వెళ్లారా? అంతే సంగతులు. ఆ ఇంటికి కన్నం వేసేస్తున్నారు.వారం రోజుల్లో కోన్ని చోట్ల వరుస దొంగతనాలు జరిగాయంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నాయుడుపేట లో వరస దొంగతనాలతో పట్టణ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వరుస దొంగతనాలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిందితుల వేటలో పోలీసులు ఉండగానే కొత్త చోరీ ఘటనలు ప్రజలను భయపెడుతున్నాయి. నాయుడుపేట పట్టణ శివారు ప్రాంతాల్లో దొంగతనాలు ఎక్కువగా ఉన్నాయి. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగాతాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని.రాత్రి పూట దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసులు రాత్రి పూట పెట్రోలింగ్ చేస్తున్న దొంగ తనాలు మాత్రం ఆగడంలేదు. పగలు,రాత్రి తేడా లేకుండా దొంగలు రెచ్చిపోతున్నారు.వరుస దొంగతనాలు జనం ఆందోళనకు గురవుతున్నారు. దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు.

ఇంటికి తాళం వేసి ఎదైనా ఊరికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో వస్తువులు దోపిడీకి గురవుతున్నాయి. ఇలా వరుస దొంగతనాలతో జనం ఊరెళ్లాలన్నా భయపడిపోతున్నారు. ఒకవైపు పోలీసులు హైవే పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా దొంగతనాల సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పోలీసులు ఇప్పటికైనా నిఘాను కట్టుదిట్టం చేసి వరుస దొంగ తనాలను అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. పోలీసులు గస్తి పెంచాలని కోరుకుంటున్నారు.

ఎవరు లేని ఇండ్లే టార్గెట్ చేస్తూ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు దోపిడీలకు అడ్డుకట్ట వేసే విధంగా దర్యాప్తు ముమ్మరం చేయాలని, దొంగలను పట్టుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే కాలనీల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు, పోలీస్ పెట్రోలింగ్ ఎక్కువ సార్లు కాలనీల్లో నిర్వహించాలని నాయుడుపేట ప్రజలు కోరుతున్నారు.

# ముస్తాబు అవుతున్న ప్రభలు

## గ్రామాల్లో ప్రభల సంబరం





**కోటప్పకొండ కొండ(ప్రశ్న న్యూస్)** భక్తులకు కోటయ్యస్వామి కొంగు బంగారం. మహాశివరాత్రి పర్వది నాన ప్రముఖ శైవక్షేత్రం కోటప్ప కొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరగ నుంది. చేదుకో కోటయ్యా అంటూ ఒకరోజు ముందు నుంచి ప్రభల తరలింపు ఒక్కో ప్రభ ఎత్తు 90 అడుగులు పైనే..గ్రామాల్లో కోలాహలం. చేదుకో కోటయ్య. చేదుకో అంటూ హరహర నామం ప్రతిధ్వనిస్తు కోటప్పకొండకు ప్రభలు బయలుదేరనున్నాయి. మహాపర్వదినాన్ని పురస్కరించుకుని భారీ విద్యుత్ ప్రభలు కొలువు దీరనున్నాయి. కొండపై కొలువున్న కోటయ్య స్వామి కిందకు దిగి రావాలంటే కోటిన్నొక్క ప్రభ నిర్మించాలని స్థల పురాణం చెపుతోంది. ఈ నమ్మకంతో భక్తులు ప్రభలను నిర్మిస్తూ కొండకు తరలిస్తున్నారు. చిలకలూరిపేట,కోటప్ప కొండ భక్తు లకు కోటయ్యస్వామి కొంగు బంగారం.మహాశివరాత్రి పర్వది నాన ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీకోటేశ్వర స్వామి సన్నిధిలో తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరగనుం ది. మహిమాన్విత క్షేత్రంగా వెలుగొందు తున్న కోటప్పకొండ తిరునాళ్లలో భారీ విద్యుత్ ప్రభలు కొలువు దీరతాయి. తిరు నాళ్లకు పల్లెల్లో పోటాపోటీగా ప్రభలను నిర్మిస్తారు. ఒక్కో ప్రభ 90 అడుగులకు పైగా ఎత్తులో రూపుదిద్దుకుంటోంది. సం స్కృతి, సంప్రదాయాలకు ఈ ప్రభలు అద్దం పడతాయి.

### నెల రోజుల ముందుగానే..

తిరునాళ్లకు నెలరోజుల ముందు నుంచే గ్రామాల్లో భారీ విద్యుత్ ప్రభల సందడి మొదలవు తుంది. ఊరంతా కలసి కట్టుగా ప్రభ పనుల్లో పాల్గొంటారు. ఈ ఏడా ది తిరునాళ్లకు భారీ విద్యుత్ ప్రభలు తరలి వస్తున్నాయి. ఒక్కో ప్రభ నిర్మాణ వ్యయం రూ.30 నుంచి రూ.35 లక్షల వరకు ఉంటుంది. గతంలో ఎడ్లతో ప్రభ ను తరలించేవారు. నేడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ప్రభ పగ్గాలు పట్టేందు కు వందలాది మంది పాల్గొంటారు. రథం ఇరుసు విరిగితే వెంటనే తయారు చేసేందుకు సంబంధిత పని వారు వెంట నడుస్తారు. రంగు రంగుల లైట్లు, వీటిని వెలిగించే విధానం చూపరులను కట్టి పడే స్తుంది. ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడతాయి. ఈ ప్రభలలో పోస కూర్పు ప్రభలు, మండపాల ప్రభలు, టిక్కీల ప్రభలు, విద్యుత్ ప్రభలు, బాల ప్రభలు ఇలా వివిధ రకాలుగా ఉంటాయి. సాధారణ ప్రభలు అధిక సంఖ్యలో కొండకు తరలి వస్తాయి. ప్రభలపై తిరునాళ్లలో సంగీత విభావరి, నృత్యాలు నిర్వహిస్తారు. నరసరావు పేట మండలంలోని గురవాయపాలెం, ఉప్పల పాడు, కాకాని గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి.

### ఈ ప్రభలదే ప్రత్యేకత..

చిలకలూరిపేట, కోటప్పకొండ తిరుణాళ్లలో చిలకలూరిపేట ప్రాంత ప్రభలకు ప్రత్యేకత ఉంది. కావూరు, అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం, గోవిందాపురం, కమ్మవారిపాలెం, యడవల్లి, మద్దిరాల, బొప్పూడి, పురుషోత్తమపట్నం గ్రామాలలో రెండు రోజులముందే పూర్తిచేసి ప్రభలను ఠీవీగా నిలుపుతారు, చేదుకో కోటయ్య అంటూ శివరాత్రి నాడు బయలుదేరనున్నాయి. పురుషోత్తమపట్నం నుంచి ఈ ఏడాది విడదల, తోట పుల్లప్పతాత, గ్రామ, మండలేనేని, బైరా, చిన్నతోట, యాదవరాజుల, తోట కృష్ణమ్మ ప్రభ ,బ్రహ్మం గుడి బజార్ , ప్రభలు కొండకు బయలుదేరేందుకు సిద్ధమయ్యాయి. క్రమం తప్పకుండా కోటప్పకొండకు ప్రభను నిర్మించే కావూరు ప్రభ ప్రభ 78 వసంతాలను పూర్తిచేసుకుని కోలాహలంగా కొండకు బయలదేరందుకు సిద్ధమైంది. అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం, గోవిందాపురం, కమ్మవారిపాలెం, యడవల్లి, మద్దిరాల గ్రామాలలో కనులపండువగా గ్రామ తిరుణాళ్ల పండుగను జరుపు కొనున్నారు. నాదెండ్ల మండలంలోని అవిశాయిపాలెం, అప్పాపురం గ్రామాలకు చెందిన భారీ విద్యుత్ ప్రభలను గ్రామస్తులు సిద్ధం చేశారు. ఉదయం 10 గంటల నుంచి ఈ ప్రభలను గ్రామస్తులు కొండకు ఊరేగింపుగా తరలించనున్నారు. అవిశాయిపాలెం ప్రభ ఈ ఏడాది 68వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది.

## మడియాలేశ్వర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం లో పాల్గొన్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



గిద్దలూరు (ప్రశ్న న్యూస్ ) కొంగలవీడు రోడ్డులోని శ్రీ మడియాలేశ్వర స్వామి దేవస్థాన పంచమ వార్షికోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మేళాతాళాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందచేసి, పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు

## వివాహ వేడుకలకు హాజరైన : తంగిరాల సౌమ్య. విప్



కంచికచర్ల (ప్రశ్న న్యూస్ )పరిటాల గ్రామం నందు ఆదివారం నాడు పురుమా సాంబశివరావు కుమారుడి వివాహ వేడుకకు జనసేన పార్టీ సమన్వయకర్త తంబాలపల్లి రమాదేవి కూటమినేతలతో కలిసి వివాహ వేడుకలకు హాజరైన ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఈ మేరకు వారి కుటుంబ సభ్యులతో కలిసి నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన శాసనసభ్యులు కృష్ణప్రసాదు



**మైలవరం (ప్రశ్న న్యూస్)** మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇళ్ల రవి కుమార్తె సాయిసృజన వివాహం, శ్రీకాంత్ తో విజయవాడలోని ఎన్.ఏ.సి కళ్యాణవేదికలో ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకలలో పాల్గొన్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ముత్తుముల



గిద్దలూరు( ప్రశ్న న్యూస్) పట్టణంలోని చీతీరాల కళ్యాణ మండపంలో తాటిచర్ల గ్రామానికి చెందిన కీ.శే బత్తుల శ్రీనివాసులు అంజలీ దేవి కుమారుడు అనిల్ కుమార్, అంజలీ లావణ్య లకు జరిగిన వివాహా కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



గిద్దలూరు (ప్రశ్న న్యూస్ ) పట్టణం, నంద్యాల రోడ్డులోని పృథ్వీ బిల్డర్స్ డెవలపర్స్ లో నూతనంగా నిర్మించిన హైకోర్ట్ న్యాయవాది శ్రీనివాస్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.



# గూడూరులో ప్రజారోగ్యానికి 'ఫుడ్ సేఫ్టీ' ఎసరు.?

- అస్తవ్యస్థంగా ఆహార భద్రత వ్యవస్థ
- మామూళ్ల మత్తులో అధికారులు
- చోద్యం చూస్తున్న జిల్లా అధికారులు





**గూడూరు(ప్రశ్న న్యూస్)** గూడూరు పట్టణంలో ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. ఆహార పదార్ధాల కల్తీ పెద్ద ఎత్తున జరుగుతున్నప్పటికీ ఫుడ్ సేఫ్టీ విభాగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది.హార పదార్ధాలు కల్తీ నిరోధకచట్టం నీరుగారి పోతోంది. దీనివల్ల ఆహార భద్రతకు ముప్పువాటిల్లింది. తాగే ద్రవపదార్థాలు నుండి నిత్యం తినే ఆహార పదార్ధాలు యదేచ్ఛగా కల్తీ అవుతున్నాయి. ఈ కల్తీ ని అదుపు చేయా ల్సిన ఆ శాఖ అధికారులు నిద్రపోతున్నారు . కొన్నిచోట్ల కల్తీలు చేస్తున్న వ్యక్తులు దొరికినా అధికారులు నామ మాత్రంగా కేసులు నమోదు చేసి చేతులుదులుపుకుంటున్నారు. గతరెండు మూడేళ్ల నుంచి నమోదైన కేసుల్లో ఎంతమందికి శిక్షలు పడ్డాయి?. ఎంత మంది షాపులను సీజ్ చేశారు? అనే ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. నిత్యావసర వస్తువుల్లో కూడా నిత్యం కల్తీ కలుపుతూ అనారోగ్యకరమైన ఆహార పదార్థాలను ప్రజలకు కొంతమంది వ్యాపారులు అంటగడుతున్నా చర్యలు లేవు. గూడూరు పట్టణంలో ఇప్పటివరకు లెక్కలు లేకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది .ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నారా లేరా అనే సందేహాల ను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. గూడూరు పట్టణంలో పలు హోటల్ యజమానులు విచ్చలవిడి గా కల్తీ ఆహారాన్ని ప్రజలకు వడ్డిస్తున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యా డు. ఈరోజు తెచ్చిన మటన్, చికెన్ మిగిలితే వాటిని ఫ్రిడ్జ్లో నిల్వ ఉంచి మరుస టి రోజు వడ్డిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పటికీ అప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గూడూరు పట్టణంలో రోజుకో కొత్త హోటల్ దర్శనమిస్తున్నాయి. హోటల్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తు న్నారా లేదా అనే విషయాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు మరిచిపోయారు. తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు రకరకాల ఆఫర్లతో ప్రజలను ఆకట్టుకునే ప్రయ త్నం చేస్తున్నారు. తప్ప హోటల్కు వచ్చే ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించా లనే ధ్యాస ఏమాత్రం లేదని పలువురు బహటంగా విమర్శలు చేస్తున్నారు.ఎలాంటి అనుమతులు లేకుండా గూడూరు పట్టణంలో రోజుకో హోటల్ పుట్టగొడుగుల మాదిరిగా పుట్టుకొస్తున్నాయి. ఇలాంటి వాటిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పా టు చేసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రతినిత్యం హోటళ్లలో తనిఖీలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

### - గూడూరులో ఫుడ్ సేఫ్టీ అధికారుల జాడేది.?

గూడూరు పట్టణంలో వందల సంఖ్యలో హోటల్స్ బేకరీస్ రెస్టారెంట్లు ఉన్నాయని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృత తనిఖీలు చేస్తుంటే.

ఈ గూడూరు పట్టణంలో మాత్రం అందుకు విభిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. తనిఖీలు చేపట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు కార్యాలయానికి పరిమితం అవుతున్నారని ఆరోపణలు జోరందుకున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు ప్రత్యక్షమై నామమాత్రపు తనిఖీలు నిర్వహించి శాంపుల్స్ ను సేకరించి హడావిడి చేస్తున్నారనే అపవాది మూటగట్టుకున్నారు. మరుసటి రోజు అటువైపు కన్నెత్తి చూడకుండా ఉండడం షర మామూలే అయిపోయింది.ఇదే అదను చూసుకుని కొన్ని హోటల్స్ యజమానులు ధనార్జనే ధ్యేయంగా వ్యాపారం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఫుడ్ లవర్స్ కోరుతున్నారు.

# అక్షరమే ప్రసన్న హరికృష్ణ ఆయుధం

### - ప్రసన్న హరికృష్ణ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** అక్షరమే ఆయుధంగా అక్షర సేద్యం చేస్తున్న వ్యక్తిగా మీ ముందుకు వచ్చిన ప్రసన్న హరికృష్ణకు అండగా నిలిచి ఈ ఎన్నికల్లో ఆశీర్వదించాలని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పులి ప్రసన్న హరికృష్ణ కోరారు. ఆదివారం రాత్రి కరీంనగర్లోని జ్యోతిరావు పూలే మైదనాంలో పట్టభద్రల సింహగర్జన పేరున సభ జరిగింది.ఈ సభలో ఆయన మాట్లాడుతూ సమాజంపై పట్టభద్రుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తులకు ఈ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలన్నారు. ప్రసన్న హరికృష్ణ మీ అందరి కుటుంబ సభ్యుడని, సమాజం పట్ల, పట్టభద్రుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తి అని వెల్లడించారు.పట్టభద్రుల సమస్యలపై ఎవరికి అవగాహన ఉందో, ఎవరికి స్పష్టత ఉందో అన్న విషయాన్ని గుర్తించి వారికి ఓటు వేయండని ఆయన కోరారు.మీరందరు గ్రాడ్యుయేట్స్ మీకు మీ సమస్యలు ఏమిటో తెలుసు ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.గత 19 సంవత్సరాల అసిస్టేంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పట్టభద్రులకు సరైన న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికల బరిలో నిలిచి మీ ముందుకు వచ్చాను.నిరుద్యోగుల సమస్యల పై స్పష్టత,అవగాహన ఉన్న వ్యక్తిగా, పది లక్షల స్టూడెంట్స్తో అనుబంధం పెంచుకున్న వ్యక్తిగా, రాష్ట్రంలో నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ రావాడానికి కృషి చేసేన వ్యక్తిగా తనకు ఈ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలల్లో తొలి సారిగా ముఖ్యమంత్రి ప్రచారానికి రావడాన్ని ఆయన ఏద్దేవ చేసారు. విద్యారంగాన్ని కార్పోరేటర్ వ్యక్తుల చేతుల్లో పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖకు మంత్రి కూడ లేకపోవడాన్ని ఆయన విమర్శించారు.విద్యావ్యవస్థలు బాగుపడాలంటే ప్రతి వ్యక్తిలో అ తపన ఉండాలి. ఆస్తులను కాపాడుకునేందుకు రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులు పట్టభద్రుల సమస్యలను గాలికి వదిలేసి తమ ఆస్తులు కాపాడుకుంటు విద్యారంగాన్ని వ్యాపార రంగంగా, ఆదాయ వనరులుగా మార్చుకుంటారన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పట్టభద్రులైన మీ అందరికి వాస్తవాలు తెలుసు, నిజాలను గ్రహించాలన్నారు. నిరుద్యోగుల, ఉద్యోగుల, పట్టభద్రుల సమస్యలను ప్రశ్నిస్తు, వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మాటా ఇస్తున్నట్లు ఆయన పెర్కోన్నారు. ప్రసన్న హరికృష్ణ ఇచ్చిన మాటా మరిచే వ్యక్తి కాదని, మీ బిడ్డ మాట తప్పే వ్యక్తి అంతకంటే కాదని. మీలో ఒక్కడిగా, మీ అన్నగా, తమ్ముడిగా, మీ వాడిగా ఆదరించి ఆశీర్వదించమని కోరారు. . మీ సమస్యల పరిష్కారంలో అవకాశం కల్పించమని విజ్ఞప్తి చేసారు. ఈ సింహ గర్జనలో బిఎస్పి రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్,బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవి, నాయకులు విక్రమ్, విఠల్ తదితరులు పాల్గోన్నారు.

# కూటమి ప్రభుత్వ విజయాలే ప్రచార సాధనాలు

- యువనేత నారా లోకేష్ సారధ్యంలో అభివృద్ధికి ఓటేద్దాం
- మంగళగిరి నియోజకవర్గం,దుగ్గిరాల మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల విస్తృత ప్రచారం నిర్వహించిన జంపాల సీతారామయ్య.



**దుగ్గిరాల (ప్రశ్న న్యూస్)** గత ఎనిమిది నెలలుగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాధించిన విజయాలను, చేస్తున్న అభివృద్ధిని సాధనంగా చేసుకొని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో దూసుకెళ్తున్నారు మంగళగిరి నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య. ప్రచారంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని దుగ్గిరాల మండలంలో స్థానిక కూటమి నాయకులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రవేట్ సంస్థల్లో ఉన్న గ్రాడ్యుయేటర్లకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువనేత నారా లోకేష్ సారథ్యంలో నియోజకవర్గ ప్రజలందరూ ఆలోచించి అభివృద్ధికి ఓటేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు సారధ్యంలో 8 నెలల్లోనే రాష్ట్రం భవిష్యత్తు దిశగా, హామీల అమలు దిశగా సాగుతుందన్నారు. అతి తక్కువ సమయంలోనే కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ఓటర్లకు వివరించారు.విద్యా శాఖ మంత్రిగా యువ నేత నారా లోకేష్ 100 కోట్ల రూపాయలతో సాల్ట్ ప్రోగ్రామ్ కింద పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయులకు శిక్షణ కోసం నిధులు విడుదల చేసి విద్యారంగాన్ని పూర్తి పటిష్టం చేస్తున్నారని అన్నారు. 4,10,125 ఉద్యోగాలు రూ. 6,33,568 కోట్ల విలువైన ఒప్పందాల ద్వారా ఉద్యోగాలు సృష్టించారని తెలిపారు. 16,347 పోస్టులు మెగా డీఎస్సీ కింద ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సిద్ధమైందన్నారు. 2,50,000 మంది విద్యార్థులు నాస్కామ్, మైక్రోసాఫ్ట్, సేల్స్ఫోర్స్ భాగస్వామ్యంతో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.2.4 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ను స్వర్ణాంధ్రప్రదేశ్గా మార్చేందుకు భారీ ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేశారని అందుకు ముఖ్యమంత్రి తనదైన శైలిలో ఆర్థిక వ్యవస్థ పటిష్టం చేస్తున్నారు అని తెలిపారు. కూటమి ప్రభుత్వ విజయాలు గణాంకాలతో నిరూపిస్తున్నట్లు ఈ అభివృద్ధిని చూసి గుంటూరు మరియు కృష్ణ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు మద్దతుగా నిలిచి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మరింత ప్రకాశవంతం చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు

# ఆ విషయంలో బాధగానే ఉంది



'తాప్సీ పెద్ద కాపీ మాస్టర్.. తన సోదరి కంగనా రనౌత్‌ని ఇమిటేట్ చేస్తూ నటిస్తుంది.' అని కంగనా సోదరి రంగోలి గతంలో మీడియా ముందు వ్యాఖ్యానించి పెద్ద దుమారం రేపింది. ఆ వ్యాఖ్యలపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించింది తప్సీ. 'ఆమెను అదేవిధంగా అనుకోనివ్వండి. నాకేం ఇబ్బంది లేదు. కంగనా ఎంతో టాలెంట్ కలిగిన నటి. ఆమెను కాపీ కొట్టాననంటే సంతోషంగా స్వీకరిస్తా. ఒక వ్యక్తి ఎదుగుదలను, వ్యక్తిత్వాన్ని మాటలే నిర్ణయిస్తాయి. నేనైతే నాలా స్వశక్తితో ఎలాంటి నేపథ్యం లేకుండా ఎదిగిన అమ్మాయిని ఈ విధంగా విమర్శించను. కంగనాను కాపీ కొడుతున్నాను అన్నందుకు బాధలేదు కానీ.. కంగనాకు ఇచ్చినంత పారితోషికం నాకు రావడంలేదు. ఆ విషయంలో మాత్రం కాస్త బాధగా ఉంది.' అంటూ అందంగా నవ్వేసింది తాప్సీ.

# రిలీజ్‌కి రెడీ అవుతున్న కార్తీ 'యుగానికి ఒక్కడు'

తమిళ నటుడు కార్తీ నటించిన క్లాసిక్ చిత్రాలలో 'యుగానికి ఒక్కడు'(తమిళంలో 'ఆయిరత్తిల్ ఒరువన్') ఒకటి. సెల్వరాఘవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని డ్రీమ్ వ్యాలీ కార్పొరేషన్ బ్యానర్‌పై ఆర్. రవీంద్రన్ నిర్మించారు. కార్తీ, రీమా సేన్, ఆండ్రియా జెరెమయ్యా ప్రధాన పాత్రల్లో నటించారు. హిస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రం 2010లో విడుదలై తమిళంతో పాటు తెలుగులో సూపర్ హిట్ అందుకుంది. అయితే ఇదే సినిమాను దాదాపు 15 ఏండ్ల సంవత్సరాల తర్వాత మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. 1279 %ూణ%, 14వ శతాబ్దం, మరియు 2010 మూడు వేర్వేరు కాలాల్లో జరిగే కథను చూపిస్తుంది. కథ ప్రధానంగా చోళ సామ్రాజ్యం చుట్టూ తిరుగుతుంది. 1279లో చోళ రాజు తన రాజ్యాన్ని పాండ్యుల నుంచి కాపాడేందుకు తన కుమారుడిని తన ప్రజలను రహస్య స్థలానికి పంపిస్తాడు. అయితే కనిపించకుండా పోయిన చోళుల జాడని వెతకడానికి కార్తీతో పాటు శాస్త్రవేత్తలు పాండ్య వంశానికి చెందినవారు ఒక ప్రమాదకరమైన ప్రయాణం చేపడతారు. అయితే వీరు వెళ్లే క్రమంలో ఎదురైన ప్రమాదాలు ఏంటి. వీరందరూ చివరికి చోళుల జాడను కనిపెడతారా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.




# అన్యాయాలను ప్రశ్నించే నారి



మహిళల్ని గౌరవించాలి, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి అనే కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న చిత్రం 'నారి'. ఆమని, వికాస్ విశిష్ఠ, మౌనిక రెడ్డి, ప్రగతి, సునయన, కేదార్ శంకర్, ప్రమోదినీ ముఖ్య పాత్రధారులు. సూర్య వంటిపల్లి దర్శకుడు. శశి వంటిపల్లి నిర్మాత. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7 సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. అగ్ర నిర్మాత దిల్‌రాజు ట్రైలర్‌ని ఆవిష్కరించి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. 'ఓ మహిళ జీవితాన్ని మూడు దశల్లో చూపించాం. ఇలాంటి సినిమా చేసినందుకు దర్శకుడిగా గర్విస్తున్నా. ఇందులో ప్రధాన పాత్రగా ఆమని గారిని తప్ప మరొకరిని ఊహించలేం. అద్భుతంగా నటించారమె.' అని దర్శకుడు చెప్పారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తుందీ సినిమా అని ఆమని తెలిపారు. మహిళల కోసం నిర్మించిన ఈ సినిమా సకుటుంబంగా చూసి ఆనందించేలా ఉంటుందని నిర్మాత శశి వంటిపల్లి చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్

## మంచు పర్వతాల్లో మిరాయ్ సాహసాలు



సూపర్‌హీరో కాన్సెప్ట్‌తో 'హను-మాన్'ఫేం తేజ సజ్జా నటిస్తున్న సినిమా 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ పానిండియా మూవీని నిర్మిస్తున్నారు. ఇందులో తేజ సజ్జా సూపర్ యోధ పాత్రలో కనిపించనున్నారు. ఆగస్ట్ 1న ఎనిమిది భాషల్లో 2డి, 3డి ఫార్మాట్లలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల చేయనున్నట్టు శనివారం మేకర్స్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. రక్షబంధన్, స్వాతంత్ర్య దినోత్సవం దగ్గరగా వస్తున్న సందర్భంలో 'మిరాయ్' సందడి చేయనున్నదని వారు తెలిపారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు. మంచు పర్వతాల మధ్య నిలబడి, ఒక కర్రను పట్టుకుని, ఆవేశంగా చూస్తున్న తేజా సజ్జాను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. మంచు మనోజ్ ఇందులో విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గౌరహరి, మాటలు: మణిబాబు, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, స్క్రీన్‌ప్లే, ఛాయాగ్రహణం, దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని.



# మల్లేష్ గీతాలాపన

శ్రీనాథ్ మాగంటి, గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'మెన్షన్ హౌస్ మల్లేష్'. బాల సతీష్ దర్శకుడు. రాజేష్ నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమాలోని 'బంగారి.. బంగారి..' గీతాన్ని హీరో అడివి శేష్ లాంచ్ చేశారు. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను సురేష్ బొబ్బిలి స్వరపరచగా, హారిణి ఇవటూరి ఆలపించారు. నాయకానాయికల ప్రేమబంధాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. మురళీధర్ గౌడ్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, సాయి ప్రసన్న తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: అమ్మ ముత్తు, నిర్మాణం: కనకమేడల ప్రొడక్షన్స్.

## పీపుల్స్ స్టార్ ట్యాగ్‌పై వివాదం.. స్పందించిన నటుడు సందీప్ కిషన్





నటుడు సందీప్ కిషన్, రీతు వర్మ జంటగా నటిస్తున్న తాజా చిత్రం మజాకా. ఈ సినిమాను దర్శకుడు త్రినాధరావు తెరకెక్కిస్తున్నాడు. ఏకే ఎంటర్ టైన్ మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఫిబ్రవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. లవ్ %ఉ% కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రానుండగా.. ఈ చిత్రంలో రావు రమేశ్, 'మన్మథుడు' ఫేమ్ అన్షు కీలక పాత్రలను పోషిస్తున్నారు. అయితే ఈ మూవీతో పీపుల్స్ స్టార్ అనేట్యాగ్ ను తగిలించుకున్నాడు సందీప్ కిషన్. దీంతో ఈ విషయం సోషల్ మీడియాలో పెద్దఎత్తున్న చర్చకు దారితీసింది. దిగ్గజ దర్శకుడు ఆర్. నారాయణ మూర్తి ట్యాగ్‌ను మీరు ఎలా వాడుకుంటున్నారు అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. తాజాగా ఇదే విషయంపై సందీప్ కిషన్‌ని ప్రశ్నించగా.. సందీప్ మాట్లాడుతూ.. ఆర్. నారాయణ మూర్తికి ఆ ట్యాగ్ ఉందని నాకు తెలిందదండి.. నేను ట్యాగ్‌ల మీదా ఫోకస్ పెట్టేవాడిని కాను. ఈ ట్యాగ్ నాకు పెట్టిన తర్వాత మూర్తి గారికి ఆ ట్యాగ్ ఉన్న విషయం నాకు తెలిసింది. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏం చేయాలో మేము ఆలోచించాం అంటూ సందీప్ కిషన్ చెప్పుకోచ్చాడు.

## భరతనాట్యం నేపథ్యంలో అందెల రవమిది

స్వీయ దర్శకత్వంలో ఇంద్రాణి దవులూరి నటిస్తున్న చిత్రం 'అందెల రవమిది'. నాట్యమార్గం ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు హరీశ్‌శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇంద్రాణి కుటుంబంతో నాకు మంచి అనుబంధం ఉంది. వారు అమెరికాలో ఉంటూ మన కళలు, సంస్కృతి మీద గౌరవంతో పిల్లలకు క్లాసికల్ డ్యాన్సులు నేర్పిస్తుంటారు. మన సంస్కృతి ఔన్నత్యాన్ని తెలియజెప్పే ఉద్దేశ్యంతో ఈ సినిమా తీయడం అభినందనీయం' అన్నారు. ఇంద్రాణి దవులూరి మాట్లాడుతూ 'రెండువేల ఏళ్ల నాటి కళ భరతనాట్యంను బ్రతికించుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా మన కళల విలువ తెలియజెప్పాలనే లక్ష్యంతో ఈ సినిమా తీశాం. పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో మా సినిమాకు ప్రశంసలు దక్కాయి' అని చెప్పారు. తనికెళ్ల భరణి, ఆదిత్యమీనన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ కొడకండ్ల, నిర్మాత, దర్శకత్వం: ఇంద్రాణి దవులూరి.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ )** కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ కొండపురం మంగమ్మ, కిష్టయ్య దంపతుల కుమారుడు సునీల్ మరియు కర్రె బాలమ్మ , బాలకృష్ణయ్య కూతురు శిరీష ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సాపూర్ శాసన సభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ నూతన దంపతులను అక్షింతలు వేసినిండునూరేళ్లసుఖసంతోషాలతోఆయురారోగ్యాలతో దంపతులిద్దరూ మీ దంపత్య జీవితం ఇలాగే కొనసాగాలని దంపతులను దీవించారు ఈ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న కొల్చారం మండలం మాజీ జెడ్పిటిసి ముత్యం గారి మేఘమాల సంతోష్ కుమార్, కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు , కిష్టాపూర్ తాజా మాజీ గ్రామ సర్పంచ్ తిరునగరి గోదావరి వెంకటరాములు, కొల్చారం మండలం మాజీ ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వినోద్ నాయక్ , కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జ్ తుక్కాపూర్ రవీందర్, కిష్టాపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ వరిగుంతం నాగరాజు, కిష్టాపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ మాల్కె నరేందర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శేరిపల్లి రాజయ్య , అక్కే రవి, నర్సింలు, నెల్లి పోచయ్య, పుష్ప రాణి, యాదమ్మ, నిర్మల, సత్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ని ఓటు అడిగిన

### ఎమ్మెల్సీ ఎన్నికల మండల ఇన్చార్జ్ అశోక్ సాదుల



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ )** శివ్వంపేట మండలంలోని గోమారం, పెద్ద గొట్టిముక్ల, చెన్నాపూర్ గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గోమారం గ్రామంలో నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి గోమారంలో ఎమ్మెల్సీ ఓటు హక్కు కలిగి ఉన్నందున శివ్వంపేట మండల ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ అశోక్ సాదుల కలిసి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం భారతీయ జనతాపార్టీ అభ్యర్థి చిన్నమైల్ అంజి రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయమని అడగడం జరిగింది. అనంతరం అశోక్ సాదుల మాట్లాడుతూ మండలంలోని పట్టభద్రులందరు బీజేపీ బలపరిచిన అభ్యర్థి చిన్నమైల్ అంజి రెడ్డి కి మీ యొక్క మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించగలరని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకలి భిక్షపతి , బీజేవైఎం మండల అధ్యక్షులు బల్కంపేట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ టీచర్స్ మద్దతు ప్రసన్న హరికృష్ణ కే

### - ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అధ్యక్షులు విజయ్ కుమార్




**మంథని ( ప్రశ్న న్యూస్)** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ ( గురుదక్షిణ ) మద్దతు ప్రసన్న హరికృష్ణ కేనని వ్యవస్థాపక అధ్యక్షులు నారమళ్ళ విజయ్ కుమార్ అన్నారు ఆదివారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్, మెదక్, నిజామాబాద్ మరియు ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మా మద్దతు ప్రసన్న హరికృష్ణ కే అని తెలిపారు, గత ఐదు నెలలుగా మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, రామగుండం, పెద్దపల్లి, మంథని లోనీ గురువులతో సమావేశాలు నిర్వహించి అందరి అభిప్రాయాలతో తమ మద్దతు ప్రసన్న హరికృష్ణ కే అని నిర్ణయించారు, ముఖ్యంగా ప్రైవేట్ గురువులకి , ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పిస్తామని ప్రసన్న హరి కృష్ణ హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు విజయ్ కుమార్ తెలిపారు. 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేటు గురువులందరూ, ప్రసన్న హరికృష్ణ కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజయ్ కుమార్ కోరారు.



## ఉద్యమకారులకు ప్రశంస పత్రాలు అందజేత

**మంథని( ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాస్ ఆదేశానుసారం మంథని మండలంలోని రాష్ట్ర ఉపాధ్యక్షులు మంథని విజయకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మంథని విద్యార్థి యువత కార్యాలయంలో ఉద్యమకారులకు తెలంగాణ రాష్ట్ర చరిత్ర పుస్తకం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ఉద్యమ ప్రశంస పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ గోగుల రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్, రాష్ట్ర మహిళా నాయకురాలు అక్కపాక లక్ష్మి, మంథని మండల అధ్యక్షులు కాసిపేట సాంబయ్య, ప్రధాన

# మంత్రపురిలో ప్రసిద్ధిగాంచిన పంచ శివాలయాలు

- శివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు
- దక్షిణ భారతదేశంలోనే పశ్చిమముఖంగా వెలిసిన ఏకైక శివలింగం
- మహిమాన్విత శివలింగానికి నిత్య పూజలు



**మంథని ( ప్రశ్న న్యూస్)** మహా శివరాత్రి పర్వదినమున పురస్కరించుకొని మంథని పట్టణంలోని శివాలయాలను అందంగా అలంకరిస్తున్నారు. ఈనెల 26న మహా శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన మంత్రపురి లోని శ్రీ ఓంకారేశ్వర, శ్రీ భిక్షేశ్వర, శ్రీ శీలేశ్వర - సిద్దేశ్వర, శ్రీ గౌతమేశ్వర స్వామి దేవాలయాల్లో నిర్వహించబడే శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. పంచ ముఖాలు కలిగిన భోళా శంకరునికి మంత్రపురిలో ఐదు శివాలయాలు వందల సంవత్సరాలుగా ఎంతో ప్రసిద్ధిగాంచాయి. ముఖ్యంగా తమ్మి చెరువు కట్ట వీధిలో గల శ్రీ భిక్షేశ్వర స్వామి దేవాలయంలో పశ్చిమ ముఖంలో వెలసిన శ్రీ భిక్షేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. కాశీ తర్వాత పశ్చిమ ముఖద్వారంగా వెలసిన ఏకైక శివ లింగంగా శ్రీ భిక్షేశ్వర స్వామి దేవాలయం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. శ్రీ భిక్షేశ్వర స్వామి భక్తులకు భిక్ష పెట్టేవాడుగా చెప్పబడుతుంది. గతంలో బోడగుడిగా పిలువబడే శ్రీ భిక్షేశ్వర దేవాలయానికి కీర్తిశేషులు మహావాది విస్సయ్య కుమారుడు నరసయ్య శిఖరాన్ని కట్టించారు. ఈ ఆలయంలో మరొక ప్రత్యేకత సంతరించుకుంది. ఆలయ ముఖద్వారంలో ప్రవేశించగానే మొదట లింగ రూపంగా దక్షిణామూర్తి దర్శనమిస్తారు. అనంతరం భిఘ్నేశ్వర స్వామి, అన్నపూర్ణ అమ్మ వారు, నందీశ్వరుడు కొలువుతీరి ఉండడం విశేషం. గర్భగుడిలో ఎంతో పెద్దదిగా పశ్చిమ ముఖంగా శ్రీ భిక్షేశ్వర స్వామి కొలువు తీరి భక్తులకు దర్శనమిస్తుంటారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు వంటి ఎందరో ప్రముఖులు ఈ ఆలయంలోని శ్రీ భిక్షేశ్వర స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. ఈ సందర్భంగా చాగంటి తన అనేక ప్రవచనాల్లో ఈ ఆలయ ప్రాముఖ్యతను తెలుపుతూ ఎంతో మహిమాన్వితం కలిగిన ఈ ఆలయాన్ని భక్తులు దర్శించుకుంటే వారి జన్మ సార్థకం అవుతుందని తెలిపారు. శివరాత్రి పర్వదినం రోజున అర్ధరాత్రి నిషిదళం పెట్టడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి "నిషి" దలాన్ని సమర్పిస్తుంటారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఈ ఆలయంలో అర్ధరాత్రి 12 గంటలకు నిషిదలాన్ని సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. శివునికి పంచ ముఖాలు ఉన్నట్లు మంథనిలో కూడా పంచ శివాలయాలు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ప్రతి సోమవారం ఈ ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహిస్తారు. శ్రీ ఓంకారేశ్వర స్వామి, శ్రీ బిగ్గేశ్వర స్వామి, గోదావరి నది తీరంలో గల శ్రీ గౌతమేశ్వర స్వామి, శ్రీ శీలేశ్వర - శ్రీ సిద్దేశ్వర స్వామి దేవాలయాల్లో నిత్యం పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నారు. శ్రీ శీలేశ్వర సిద్దేశ్వర స్వామి దేవాలయాన్ని లోకే మనోహర్, లోకే శరత్ సోదరులు అన్ని రకాల హంగులతో పునరుద్ధరించారు. అలాగే గోదావరి తీరంలో శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ సురాభాండేశ్వర స్వామి దేవాలయాల కూడా ఉన్నాయి. శివరాత్రి రోజున భక్తులు పూర్తిగా ఉపవాస దీక్ష ఆచరిస్తూ ఈ శివాలయాల్లోని స్వామివారికి నిషిదలాన్ని సమర్పిస్తూ పునీతులవుతారు.

## సొంత గూటికి తిరిగి చేరుకున్న సెగ్గం రాజేష్

### కండువా ఆహ్వానించిన ఐటీ మంత్రి



**మంథని( ప్రశ్న న్యూస్)** : కాంగ్రెస్ మాజీ నాయకులు సెగ్గం రాజేష్ తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో తిరిగి సొంత పార్టీకి చేరుకున్నారు. శనివారం రాత్రి కరీంనగర్ లో బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి సెగ్గం రాజేష్ రాగ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


## అధైర్యపడవద్దు అండగా ఉంటా...



**మంథని( ప్రశ్న న్యూస్)** నమ్ముకున్న వాళ్లకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అధైర్య పడవద్దని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం మంథని పట్టణంలో హైకోర్టు న్యాయవాది, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇనుముల సత్యనారాయణను మంత్రి శ్రీధర్ బాబు పరమర్శించారు. ఇటీవల ఇనుముల సత్యనారాయణ తండ్రి, రిటైర్డ్ ఫారెస్ట్ ఉద్యోగి ఇనుముల శంకరయ్య ఆకస్మికంగా మరణించగా, శంకరయ్య దినకర్మలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని శంకరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది శశిభూషణ్ కాచే, నాయకులు గోటికారి కిషన్ జి, వోడ్నాల శ్రీనివాస్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అజీమ్ ఖాన్, ఆకుల కిరణ్, సురేందర్ రెడ్డి, సురేష్ రెడ్డి, పాపారావు, మాజీ ఎంపీపీ లక్ష్మీరాజాం, సోషల్ మీడియా ఇన్చార్జి ఆరెల్లి కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## యోగా నేర్చుకోండి

### ఆరోగ్యంగా జీవించండి: ఆల్లె సత్తయ్య



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నేటి తరంలో ఆరోగ్యం కోసం అందరం యోగ ప్రాణాయామం చేయాలని యోగా గురు ఆల్లె సత్తయ్య తెలిపారు యోగాగురువు రాందేవ్ బాబా వద్ద యోగ శిక్షణ పొంది ఆరోగ్యమే మహా భాగ్యం అనే సత్సంకల్ప దీక్షతో కొంత కాలంగా సమాజ సేవలో అంకితమై అక్కడక్కడా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి యోగ శిక్షణ నిర్వహిస్తున్నాను. ప్రస్తుత తరుణంలో కలుషితమైన వాతావరణం మనని నిత్యం రోగాలా బారిన పడవేస్తున్న సమయం ఇది. భుజించే పదార్థలలో అన్ని కల్తీ. ఎటు చూసిన ఆరోగ్యం పై పెను భారం పడి రకరకాల వ్యాధులు సోకి బాధపడుతున్న వారెందరో నిత్యం మన



ముందర తారాస పడుతువుంటారు. ప్రతి మానవుడిని వెంటాడి వేటాడుతున్నాయి. వీటిని కట్టడి చేయాలంటే యోగ ఒక్కటే మార్గం 10సం"రాల వయస్సు నుండి 100 సం రాల వృద్ధులు కూడా ఎలాంటి ఆయాసం లేకుండా సునాయాసంగా చేయు ప్రక్రియ యోగ అని సత్తయ్య తెలిపారు. బోయిగూడ కందికల్ గంగపుత్ర సంఘంలో ఆశ్రయం ఇస్తే మన బస్తీ వాసులు ఆరోగ్యంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండే విధంగా "యోగ"శిక్షణ తరగతులు నిర్వహిస్తానని అల్లె సత్తయ్య పేర్కొన్నారు. ఈ శిక్షణ ఉచితం ఎలాంటి డబ్బులు ఉండవు. ఉదయం నిర్వహిస్తామని సత్తయ్య తెలిపారు సంప్రదించవలసిన నెంబర్ 9490995238.

## సోమస్కంధమూర్తి సూర్య ప్రభ అమ్మవారు చెప్పర వాహన సేవ





**శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక ఉత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు పూర్తయిన తరువాత ఉత్సవమూర్తులను ఊరేగింపు నిర్వహించారు. గంగాదేవి సమేతుడైన సోమస్కంథమూర్తి సూర్య ప్రభ అమ్మవారు చెప్పర వాహన సేవ. వాహనంపై ఊరేగారు సూర్య ప్రభ వాహనంపై స్వామిని అధిరోహించి ఉత్సవం నిర్వహించారు. భజనలు, కోలాటాలు, వివిధ రకాల వేషాలతో కళాబృందాలు వెళుతుండగా పట్టణంలో ఊరేగింపు వేడుకగా జరిగింది. సోమస్కంథమూర్తి సూర్య ప్రభ అమ్మవారు చెప్పర వాహన సేవ పై ఊరేగిన స్వామిని భక్తులు దర్శించి తరించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. విశేష దివ్యాభరణాలు. ఉత్సవర్ల శోభతో కోలాటాలు, మేళ తాళాలు, వివిధ రకాల వేషధారణలు, మంగళ వాయిద్యాలు, వివిధ రకాల సెట్లతో శ్రీకాళహస్తి చతుర్మాడ వీధులు పులకించిపోయాయి. నేడు మూడవరోజు స్వామివారు సూర్య ప్రభ వాహనంపై, అమ్మవారు చెప్పర వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చినారు.

## వ్యాయమ శాల అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీగణేష్ సహకరించాలి

### - బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్



**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** కంటోన్మెంట్ బోయిన్ పల్లి చింతల బస్తీ జై రామ్ వ్యాయమ శాల లో కమిటీ సభ్యులు ఆదివారం నిర్వహించిన కాళిక మాత శాంతి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ పాల్గొన్నారు. అనంతరం జంపన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ తో మాట్లాడి 20 లక్షల రూపాయల ను వ్యాయమ శాల కు ఇచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ వ్యాయమ శాల నుండే శారీర దాడుర్యం తో పాటు, రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానని పాత రోజుల ను గుర్తు చేసుకున్నారు.జై రామ్ వ్యాయమ శాల 75 సంవత్సరాల చరిత్ర కలిగిందని ,ఇక్కడి నుండి ఎంతో మంది జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. మానసిక ఒత్తిడి లోనైతే వ్యాయమం చేస్తే దూరమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజు యాదవ్, దామోదర్, బచ్చన్ రాజు, దిలీప్, సందీప్, గిరి, హరీష్, సాయి కిషోర్, భరత్, పోతరాజు సాయి తదితరులు పాల్గొన్నారు.

## యువతలోప్రతిభను వెలికి తీసే దిశగా నారాయణ విద్యాసంస్థలు

### సైన్స్ ఎక్స్పోలో గొల్లపూడి నారాయణ విద్యార్థుల ప్రతిభ



విజయవాడ(ప్రశ్న న్యూస్ ) విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే దిశగా నారాయణ విద్యాసంస్థ కృషి చేస్తుందని ఏజీఎం హరీష్ అన్నారు విజయవాడ నగరంలో పి.బి సిద్ధార్థ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఎక్స్పోలో గొల్లపూడి నారాయణ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు హేమంత్ కృష్ణ, అనీష్, అనన్య విశేష ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచారు ఏజీఎం హరీష్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం మార్కులకు మాత్రమే పరిమితం కాకుండా సృజనాత్మకంగా ఆలోచించి తరగతి గదిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను ప్రయోగ తల ద్వారా అవగతం చేసుకుంటే మేధాశక్తి పెరుగుతుందన్నారు విద్యార్థులు కేవలం ర్యాంకులే పరమావధిగా చదవకుండా భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు శనివారం సిద్ధార్థ కళాశాల నిర్వహించిన సైన్స్ ఎక్స్పోలో స్మార్ట్ సిటీ అనే అంశంలో మంచి ప్రతిభ కనబరిచి విద్యార్థులు రెండో స్థానంలో నిలవడం ఆనందదాయకమని ప్రిన్సిపాల్ మాధవి లత అన్నారు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు

# మురికి కూపాలుగా మెస్‌లు హొటల్స్

## - జాడేలేని ఫుడ్ సేప్టీ పర్యవేక్షణ అధికారులు

- కలిషిత నీరు, కల్తీ పదార్థాలు - హొటల్స్, టిఫిన్ సెంటర్లు, మెస్‌లలో రాజ్యమేలుచున్న అపరిశుభ్రత
- ప్లేట్లు, స్పూన్లు కడగడంలో నిర్లక్ష్య వైఖరి - టేబుల్స్ పై ఈగల, బొద్దింకల స్థైర్య విహారం
- అంటురోగాలకు కేంద్రాలుగా హొటళ్ళు, మెస్‌లు
- పాస్ట్ ఫుడ్ సెంటర్లు మెస్ లు, హొటల్స్ కు అనుమతులెవరిస్తున్నారు
- నిబంధనలు పాటించని వాటిపై చర్యలేవి.? - ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రజలకు అనారోగ్యాలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రానురాను ప్రజాజీవితాల్లో చోటు చేసుకుంటున్న మార్పుల వల్ల ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుచున్నాయి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లలో కాలక్రమేపి వస్తున్న మార్పులతో ఇంటి తిండి చేదెక్కి బయటి తిండి ప్రియమైన వేళ ఎన్నో అనారోగ్య సమస్యలు పొడ చూపుతుండడంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుచున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పాస్ట్ ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు. మెస్ లు, హొటళ్ళలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించక పోవడంతో పాటు తినుబండారాల తయారీలో కల్తీ పధార్థాల వాడకం పెద్ద సమస్యగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తు ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుచున్నను సంబంధిత అధికారులకు సోయి లేదు. ఇక నగరంలోని రద్దీ ప్రాంతాలలో విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న మెస్ లలో ఆహర పధార్థాల తయారీలో కల్తీ వస్తువులను వాడుచు జనాలను ఆకర్శించేందుకు రకరకాల ట్రిక్కులను అవలంబిస్తున్న మెస్ లపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైపోయింది. దీంతో మెస్ లు హొటళ్ళ యాజమాన్యాలు మరింత రెచ్చిపోతుండడం గమనార్హం. ఇక హొటళ్ళు,మెస్ లు, టిఫిన్ సెంటర్లలో పరిశుభ్రత పాటించకపోవడం, ప్లేట్లు, గ్లాసులు, స్పూన్లను కడగడంలో నిర్లక్ష్య దోరణి అవలంభించడం, టేబుల్స్ ను శుభ్రపరచక పోవడంతో ఈగలు విజృంభించడంతో అంటురోగాలు వ్యాప్తిచెందే అవకాశాలు అధికంగా ఉన్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే టిఫిన్ సెంటర్లు, మెస్ లలో వాడిన పేట్లు, గ్లాసులు, స్పూన్లను వేడినీటితో కడిగిన తర్వాత తిరిగి వాడాల్సి ఉండగా అపరిశుభ్ర నీటితో కడిగి వాడడంతో అనారోగ్య సమస్యలు పెరుగుచున్నాయని పలువురు గగ్గోలు పెడుచున్న అధికారుల చెవిక్కెక్కడం లేదు. హొటల్లు, మెస్ లు, టిఫిన్ సెంటర్లపై అకస్మిక దాడి జరిపి అక్కడ తయారు చేస్తున్న పధార్థాల శాంఫిల్స్ సేకరించి ల్యాబ్ రిపోర్ట్ ల ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉండగా తనిఖీ అధికారుల జాడేలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక పూట్ పాత్ లపై పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పాస్ట్ ఫుడ్ సెంటర్లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారాలు ఇష్టారాజ్యంగా మారాయి. తిను బండారాల తయారీలో నిబంధనలకు తిలోధకాలిచ్చి వాడగా మిగిలిన వంటనూనెను మళ్ళీ మళ్ళీ వాడడంతో ఉత్పన్నమవుచున్న అనారోగ్య సమస్యలపై జనాలు తీవ్ర ఇబ్బందులు పడుచున్నారు.



ఇదిలా ఉండగా విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న మెస్ లు, హొటళ్ళు, టిఫిన్ సెంటర్లకు అనుమతులెలా వస్తున్నయని, ఒకవేళ అనుమతులు లేకుండా కొనసాగుతున్న వాటిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు ఎందుకు ఉదాసీన వైకరి అవలంభిస్తున్నరనేది ప్రభుత్వం ఆలోచించాలని ప్రజలు కోరుచున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హొటల్స్, మెస్ లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై విస్తృతంగా అకస్మిక దాడులు జరిపి పరిశుభ్రత, పారిశుద్యం, కల్తీ వస్తువుల వాడకంపై నిబందనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కాలక్షేపానికే ప్రజావాణి ఒక్క సమస్య తీరిస్తే ఒట్టు

## -ప్రజావాణి అంటేనే మండిపడుతున్న ప్రజలు

- ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన సమస్యలు తీర్చడంలో అధికారులు పూర్తిగా విఫలం - జిహెచ్ఎంసి ప్రజావాణిలో సమస్యలు ఎన్ని తీర్చారో అధికారులు చెప్పగలరా
- ప్రజావాణిలో కోకొల్లులుగా అక్రమ నిర్మాణాల పై ఫిర్యాదులు - మామూళ్లకు అలవాటు పడి అటువైపు కూడా చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు
- మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డికి అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు కనపడుటలేదా

**హైదరాబాద్( ప్రశ్న న్యూస్)** రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక తన మార్పులు చూపించుకోవడానికి ప్రజా సమస్యలను తీర్చడంలో ప్రజావాణి తోడు ఉంటుందని ప్రజావాణి ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి ముందుంటుందని ప్రజావాణిని ఏర్పాటుచేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ ఒక్కరోజు మాత్రమే ప్రజావాణి ప్రజా సమస్యల వినాలని ఆ ఒక్కరోజు మాత్రమే అనిపించిందా అని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ప్రజావాణిలో ప్రజా సమస్యలు కోకోల్లులుగా వస్తున్న కూడా మున్సిపల్ అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెత్తి కూడా సమస్యలపై చూడడం లేదని నామమాత్రంగా ప్రజావాణి నిర్వహించి అధికారులు ఏసీ రూముల్లో కూర్చొని టైంపాస్ కు మాత్రమే ప్రజావాణిని వాడుకుంటున్నారు తప్ప ప్రజా సమస్యలను ఎక్కడ కూడా తీర్చిన దాఖలా లేవని గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు మున్సిపల్ శాఖ మంత్రి రేవంత్ రెడ్డి పై మండిపడుతున్నారు. అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలు తీర్చడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని ప్రగడపాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలు తీర్చడంలో ముఖ్యమంత్రి చాలా బిజీగా ఉన్నాడా.? ప్రజావాణిలో ఎన్నో సమస్యలపై ఫిర్యాదులు చేసిన అధికారులు ఆ ఫిర్యాదులను స్వీకరించి నామమాత్రంగా పక్కన పెడుతున్నారు తప్ప సమస్యలపై ఎక్కడా కూడా స్పందించిన దాఖలా లేవని సమస్య తీరిందని తప్పుడు మెసేజ్ చేస్తున్నారు ఫిర్యాదుదారులకు అది చూసి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు నగర ప్రజలు. గ్రేటర్ హైదరాబాదులో అనుమతులకు విరుద్ధంగా ఎన్నో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న వాటిపై స్థానికులు ఫిర్యాదు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఎక్కడా స్పందించి చర్యలు తీసుకున్న దాఖలా లేవని అధికారులకు ఈ అక్రమ నిర్మాణాలు కనపడడం లేదా.? ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు చెత్తబుట్ట దాఖలేనా.? ఈ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోరా




అలాంటప్పుడు ప్రజావాణి కార్యక్రమం దండగ అని ప్రజలు మండిపడుతున్నారు. జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న జోనల్ కమిషనర్ కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదు చేసిన జోనల్ కమిషనర్లు సంతకాలు చేసి కింది అధికారులకు పంపిస్తున్నారు తప్ప దానిపై పర్యవేక్షణ చేయడం లేదని ఇక కిందిస్థాయి అధికారులు ముందుగానే లంచాలు తీసుకొని అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారు కాబట్టి వాటిపై చర్యలు తీసుకోవడం లేదు ఫిర్యాదులు చేసి చేసి ప్రజలు అలసిపోతున్నారు తప్ప అధికారులు మాత్రం మాకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు ఇలాంటప్పుడు ఈ ప్రజావాణి కార్యక్రమం ఎందుకని ప్రజలు ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తున్నారు. జిహెచ్ఎంసి పరిధిలోనే కాకుండా శివారు మున్సిపాలిటీలో కూడా ఎన్నో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ప్రజలు జోనల్ కమిషనర్ కు, డిప్యూటీ కమిషనర్లకు, ఫిర్యాదులు ఇచ్చిన ఎక్కడ స్పందించిన దాఖలా లేవని ఏసీ రూముల్లో కూర్చుని ప్రజా సమస్యలను ఎలా తీరుస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిన్న కాకమున్న సాక్షాత్తు తెలంగాణ ముఖ్యమంత్రి అధికారులు ఏసీ రూముల్లో కూర్చుంటే ప్రజా సమస్యలు తీరవని ప్రజల్లోకి వెళ్లి ప్రజా సమస్యలు తీర్చాలని చెప్పినా కూడా అధికారులు ఎక్కడా కూడా సమస్యలను పట్టించుకోవడంలేదని ముఖ్యమంత్రి ఆదేశాలను లెక్కచేయని అధికారులు ప్రజల సమస్యలను లెక్క చేస్తారా.? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే తెలియాలి.

### ఏపీలో ప్రశాంతంగా ముగిసిన

# గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో ఆదివారం గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. రోస్టర్ విధానంలో మార్పులు చేయాలంటూ అభ్యర్థులు గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేపడుతున్నప్పటికీ, ఏపీపీఎస్సీ ఈ పరీక్ష నిర్వహించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈ దశలో పరీక్ష వాయిదా వేయలేమని నిన్ననే స్పష్టం చేసింది. కాగా, పరీక్ష నిర్వహణపై ఏపీపీఎస్సీ స్పందించింది. రాష్ట్రంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని వెల్లడించింది. మెయిన్స్ కు 92,250 మంది అర్హత సాధిస్తే వారిలో 86,459 మంది హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకున్నారని తెలిపింది. హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకున్న వారిలో 92 శాతం మంది హాజరయ్యారని ఏపీపీఎస్సీ వివరించింది.

# ఈరోజు కాకపోతే రేపు నీ తల నరికేస్తాం

## - ఎమ్మెల్యే రాజా సింగ్‌కు బెదిరింపు కాల్స్ కలకలం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కు మరోసారి బెదిరింపు కాల్స్ రావడం కలకలం రేపుతోంది. గతంలోనూ పాక్, ఆఫ్ఘనిస్తాన్ కేంద్రంగా ఆయన హత్యకు కుట్ర జరిగిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో రాజా సింగ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. వేరే కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాజా సింగ్ హత్యకు కుట్ర పన్నిన నిందితులను అరెస్ట్ చేశారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కు తాజాగా మరోసారి బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఆదివారం మధ్యాహ్నం తనకు రెండు నంబర్ల నుంచి కాల్స్ వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈరోజు కాకపోతే రేపు అయినా నీ తల నరికేస్తాం ఇన్షాల్లా! అంటూ తనను హెచ్చరించారని రాజా సింగ్ చెప్పారు. ఇప్పుడు మీ మోదీ (ప్రధాని నరేంద్ర మోదీ), మీ యోగి (యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్) కూడా నిన్ను రక్షించలేరంటూ తనను హెచ్చరించినట్లు టైగర్ రాజాసింగ్ తెలిపారు. ఆ ఫోన్ నంబర్లు వివరాలు మీడియాకు వెల్లడించారు. రాజా సింగ్‌కు బెదిరింపు కాల్స్ ౦918986512926 3.54గంటలకు, ౦919434154614 3.30గంటలకు, ఈ నెంబర్స్ నుంచి వచ్చాయని వెల్లడించారు.

# జనసేన శాసనసభాపక్ష సమావేశం నిర్వహించిన పవన్ కల్యాణ్

- రేపటి నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- సభలో అనుసరించాల్సిన విధివిధానాలపై పవన్ సమావేశం
- హాజరైన జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



అమరావతి (ప్రశ్న న్యూస్) రేపటి నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో, పవన్ కల్యాణ్ అధ్యక్షతన జనసేన పార్టీ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన విధి విధానాలు, పార్టీ విధానాన్ని జనసేన ఎమ్మెల్యేలకు పవన్ వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. జనసేన శాసనసభాపక్ష సమావేశంలో మంత్రి నాదెండ్ల స్వాగతోపన్యాసం చేశారు. సీనియర్ ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, మండలి బుద్ధ ప్రసాద్, మంత్రి దుర్గేష్ చట్ట సభల్లో తమ అనుభవాలు పంచుకున్నారు

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588